గురువారం
13-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 290
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'21వ శతాబ్దం సోషలిజం' - '20వ శతాబ్దం సోషలిజం' మధ్య తేడా ఏమిటి?

20వ శతాబ్దంలో సోషలిజం... 20వ శతాబ్దానికి చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిర్మితమైంది. 21వ శతాబ్దంలో సోషలిజం... 21వ శతాబ్దం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిర్మించబడుతుంది.

2లో

నిబంధనల ఉల్లంఘన నిజమే

రిషికొండ తవ్వకాలపై హైకోర్టుకు కేంద్ర కమిటీ నివేదిక

కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లకు ఆదేశాలు

తదుపరి విచారణ 26వ తేదీకి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖలోని రిషికొండపై నిబంధనల ఉల్లంఘన వాస్తవమేనని కేంద్ర కమిటీ తేల్చిచెప్పింది. రిషికొండలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ కట్టడాలు, తవ్వకాలపై తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన పార్టీకి చెందిన విశాఖ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారులతో కమిటీని నియమించిన విషయం తెల్సిందే. ఈ బృందంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలలో అనుభవజ్ఞులైన అధికారులు ఉన్నారు. ఈ బృందం గత నెల 13వ తేదీన రిషికొండకు వెళ్లి అక్కడ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని అధ్యయనం చేసింది. కొండపై నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాలు, భవన నిర్మాణాలను పరిశీలించింది. కొండపై భవన నిర్మాణాలకు ఉన్న స్థల అనుమతి ఎంత? ఏ మేరకు కొండను తవ్వారు? గతంలో కొండ విస్తీర్ణమెంత? ప్రస్తుతం తవ్వకాలు పూర్తయిన తర్వాత దాని విస్తీర్ణమెంత ఉంది. రిషికొండపై నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల్లో పారదర్శకత తదితర అంశాలన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కేంద్ర కమిటీ బృందం పూర్తి వివరాలతో హైకోర్టుకు నివేదించింది. దీనిపై బుధవారం విచారించిన హైకోర్టు ఎదుట పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు బలంగా వినిపించారు. కేంద్ర కమిటీ అందజేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను కోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

మళ్లీ మాటల యుద్ధం

ఏపీ, తెలంగాణ మంత్రుల వాగ్బాణాలు

- పాలనను భూమి, ఆకాశంతో పోల్చిన హరీశ్‌రావు
- ఇక్కడకు వచ్చి చూస్తే కనపడుతుందన్న కారుమూరి
- మా గురించి మాట్లాడటానికి ఆయనకేం సంబంధమన్న బొత్స
- విశాఖ ఉక్కుపై బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలన్న అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ, తెలంగాణ మంత్రుల మధ్య మళ్లీ మాటల యుద్ధం మొదలైంది. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిన తర్వాత దేశవ్యాప్తంగా పార్టీని విస్తరించాలని ప్రయత్నం చేస్తున్న సీఎం కేసీఆర్ ఇదే అదనుగా ఈ అంశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వ్యూహాత్మక అడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్ విస్తరణకు విశాఖ ఉక్కును ఆయుధంగా వాడుకునేందుకు పావులు కదిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వహణకు మూలధనం/ ముడిసరుకుల కోసం నిధులు ఇచ్చి నిబంధనల మేరకు ఉక్కు ఉత్పత్తులు కొనేందుకు యాజమాన్యం నిర్వహిస్తున్న ఆసక్తి వ్యక్తీకరణ బిడ్డింగ్‌లో తెలంగాణ ప్రభుత్వం పాల్గొనాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఊహించని ఈ పరిణామం వైసీపీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వైసీపీ వ్యతిరేకమని మాటలు చెప్పడమే తప్ప, అందుకోసం కనీసం ప్రయత్నాలు చేయని ఏపీ ప్రభుత్వానికి తెలంగాణ సీఎం కేసీఆర్ నిర్ణయం రాజకీయంగా ఇబ్బందుల పాలు చేసింది. విపక్షాలు మొత్తం సీఎం జగన్‌ను విమర్శించడంతో దిద్దుబాటు చర్యలకు దిగింది. దీనిలో భాగంగా పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ విశాఖ ఉక్కుపై బీఆర్ఎస్ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకించేవారు బిడ్డింగ్‌లో పాల్గొనమేమిటని ప్రశ్నించారు. మరోవైపు ఏపీలో జరిగిన అభివృద్ధిని, తెలంగాణలో జరిగిన అభివృద్ధితో అనుక్షణం పోలుస్తున్న పరిస్థితులు వివాదాస్పదంగా మారుతున్నాయి. తాజాగా మంత్రి హరీశ్‌రావు ఏపీ గురించి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తెలంగాణ అభివృద్ధి కోసం చెమట చిందించే ప్రతి ఒక్కరు తెలంగాణ బిడ్డలే అని పేర్కొన్న హరీశ్‌రావు... ఆంధ్రాలో ఓటు హక్కు రద్దు చేసుకుని తెలంగాణలో నివసించే వారంతా తెలంగాణలోనే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీ, తెలంగాణ రెండు ప్రాంతాలను ప్రత్యక్షంగా చూసిన మీరు అక్కడ రోడ్లు, ఆసుపత్రుల పరిస్థితి ఎలా ఉందో చూసే ఉంటారని వ్యాఖ్యలు చేశారు. ఏపీ పాలనకు, తెలంగాణ పాలనకు భూమికి, ఆకాశానికి ఉన్నంత తేడా ఉందంటూ జగన్ సర్కార్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కేంద్రం నుండి నిధుల కోసం మోటార్లకు మీటర్లు పెట్టి ప్రజలకు అన్యాయం చేస్తున్నారనే భావన వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఏపీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ మంత్రులు అనవసరపు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు ఒకసారి ఏపీలోకి తొంగి చూస్తే వైసీపీ ప్రభుత్వం చేసే అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. ఏపీలో రోడ్లు సరిగా లేవని మంత్రి చేసిన వ్యాఖ్యలు సరికాదని వ్యాఖ్యానించారు. ఏపీ ప్రజలు మళ్లీ సీఎం జగనే రావాలని కోరుకుంటున్నారని అన్నారు. దీనిపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. తాను ఏమన్నానని ఏపీ మంత్రులు ఎగిరెగిరి పడుతున్నారని ప్రశ్నించారు. 'మీ దగ్గర ఏమున్నది అని అంటున్నారు. మా దగ్గర ఉన్నాయి చెప్పమంటే దునియా చెబుతాం. మా దగ్గర 56 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. రైతు బీమా, రైతు బంధు ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించాం. మీ దగ్గర ఏమున్నాయంటూ ప్రశ్నలు సంధించారు. ఆనాడు ప్రత్యేక హోదా కావాలని అన్నారు. మెడలు వంచాలి అంటిరి. ఇప్పుడేమో కేంద్రం ఎగబెట్టినా ఏం అడగరు. విశాఖ ఉక్కు అమ్ముతున్నా, తుక్కుకి అమ్మినా ఎవ్వరు అడగరు. ప్రజలను గాలికి వదిలేశారు.. మీ ప్రయోజనాలు చూసుకుంటున్నారని విమర్శిస్తూ, . ఆంధ్రా మంత్రులు అనవసరంగా మా జోలికి రావద్దు'

- మిగతా 2 లో

సైనిక స్థావరంలో

కాల్పులు

నలుగురు సిబ్బంది మృతి

అప్రమత్తమైన సైన్యం

చండీగఢ్: పంజాబ్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. భటిండాలోని సైనిక స్థావరంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు సైనికులు మరణించారు. ఈ ఘటనను ధ్రువీకరిస్తూ ఉదయం 04.35 గంటలకు కాల్పుల ఘటన జరిగినట్లు ఆర్మీ సౌత్ వెస్ట్రన్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. నలుగురు ప్రాణాలు కోల్పోయారని, మరిన్ని వివరాలు తెలుసుకుంటున్నామని చెప్పారు. సత్వర స్పందన బృందాలను అప్రమత్తం చేశామని, వారు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని తెలిపారు. కాల్పులు వినిపించగానే క్విక్ రియాక్షన్ బృందాలు అప్రమత్తమై ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని గాలింపు చేపట్టాయి. నిందితులు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారి కోసం వేట కొనసాగుతోంది. కాగా సైనిక స్థావరాన్ని మూసివేసి గాలింపు చేపట్టినట్లు స్థానిక అధికారులు తెలిపారు. అయితే పోలీసులను భటిండా సైనిక స్థావరంలోకి సైన్యం అనుమతించలేదని సీనియర్ పోలీస్ సూపరింటెండ్ జీఎస్

- మిగతా 2 లో

అభివృద్ధికి గుదిబండ జగన్

- పరాకాష్ఠకు సీఎం ప్రచార పిచ్చి
- విశాఖ ఉక్కుపై సజ్జల డ్రామాలు
- కేటీఆర్‌కు సమాధానమివ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ గుదిబండలా మారారని, పోలవరం నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వరకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. జగన్ ప్రచార పిచ్చి పరాకాష్ఠకు చేరిందని ధ్వజమెత్తారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై చర్చ జరుగుతుంటే...విషయ పరిజ్ఞానం లేని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ ఏదేదో మాట్లాడుతున్నారని, అన్నీ తెలిసిన సజ్జల రామకృష్ణారెడ్డి అసత్యాలు బొంకుతున్నారని రామకృష్ణ అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తామని కేంద్రం ప్రకటించిందని, మోదీ-జగన్ కలిసి దానిని అదానీకి కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అదానీ డబ్బులకు కక్కుర్తిపడి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. జగన్ కేబినెట్ సమావేశం నిర్వహించి...అదానీకి భూములు అప్పగించారన్నారు. కృష్ణపట్నం, గంగవరం తదితర పోర్టులను అదానీకి ధారాదత్తం చేశారని, పవర్ ప్రాజెక్టులను కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం తలచుకుంటే ఉక్కు ఫ్యాక్టరీని నడపలేదా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడం ద్వారా ఆ స్థలాలు అమ్ముకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుపై మోదీకి జగన్ మంచి సలహా ఇచ్చాడంటున్న సజ్జల...ఆ సలహా ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం విషయంలోనూ జగన్ డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. జగన్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి దృష్టి మళ్లింపు రాజకీయాలకు తెరదీశారని, రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఏపీకి జగన్ ఓ గుదిబండలా మారారని దుయ్యబట్టారు. విశాఖ స్టీలు ఫ్యాక్టరీ కోసం తెలంగాణ ప్రభుత్వం బిడ్డింగ్ వేస్తే జగన్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నట్లేనని ఎద్దేవా

- మిగతా 2 లో

సంపన్న సీఎం జగన్

పేద ముఖ్యమంత్రి మమత

ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని ముప్పై మంది ముఖ్యమంత్రుల్లో 29 మంది కోటీశ్వరులుగా ఉన్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక ప్రకారం ముప్పై మంది ముఖ్యమంత్రుల్లో 29 మంది అంటే 97 శాతం కోటీశ్వరులు ఉన్నారు. ఒక్కో ముఖ్యమంత్రి సగటు ఆస్తి రూ.33.96 కోట్లుగా ఉన్నాయని ఏడీఆర్ తెలిపింది. ఏడీఆర్ విశ్లేషించిన ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధికంగా రూ.510 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆస్తులు అత్యల్పంగా రూ.15 లక్షలుగా ఉన్నాయనీ, ఆమె కోటీశ్వరులైన ముఖ్యమంత్రుల జాబితాలో చోటుదక్కించుకోలేదని ఏడీఆర్ తెలిపింది. ప్రస్తుత 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రుల స్వీయ ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించిన తర్వాత తాము ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఏడీఆర్ పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతం

- మిగతా 2 లో

విపక్ష ఐక్యతకు ముందడుగు

మోదీ సర్కార్‌ను గద్దె దించుతాం

అందరం ఒక్కటై పోరాడతాం

రాహుల్, ఖర్గేతో నితీశ్, తేజస్వి 'చారిత్రక' భేటీ

న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆయన డిప్యూటీ తేజస్వి యాదవ్ బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో 'చారిత్రక' సమావేశం నిర్వహించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి వీలైనన్ని ఎక్కువ ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలని నిర్ణయించారు. సమావేశానంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఐక్యంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటాయని, దేశానికి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మళ్లీ నొక్కే అవకాశం నీకివ్వనులే నాయనా!

అక్టోబర్ కల్లా వెలిగొండ పూర్తి

పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్ష పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటి సొరంగాన్ని పూర్తి చేశామని, రెండో సొరంగం 1.8 కిలోమీటర్లు మాత్రమే మిగిలి ఉందన్నారు. రెండవ సొరంగం పనులు సెప్టంబర్‌లో పూర్తవుతాయన్నారు.

8లో

రైతు నోట్లో రియల్టర్ 'చెత్త'

- పచ్చని పంటపొలాల్లో వ్యర్థాలు
- రియల్టర్‌తో అధికారులు, నేతల కుమ్మక్కు
- అన్నదాతల ఆర్తనాదాలు పట్టని వైనం
- రైతులకు అండగా సీపీఐ పోరాటం

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: మట్టిపై చెమట చుక్క చిందించి ఆహారం పండిస్తున్న రైతన్నకు కష్టాలు తప్పటం లేదు. సాగునీరు సమయానికి అందకపోయినా... ప్రకృతి విపత్తులు వెంటాడిన ధైర్యంగా సాగు చేపడుతున్న అన్నదాతలు... అధికారులు, అధికార పార్టీ నేతల ప్రవర్తనతో కన్నీరు పెడుతున్నారు. సాగును నమ్ముకొని బతుకుతున్న తమ పొలాల్లో చెత్త వేసి కలుషితం కాకుండా చూడాలని నెలరోజులుగా విన్నపాలు చేస్తున్నా అధికారుల్లో చలనం రావటం లేదు. బాపట్ల జిల్లా కేంద్రానికి 8 కి.మీ దూరంలో గల కర్లపాలెం మండలం కర్లపాలెం పంచాయతీ 216 జాతీయ రహదారి పక్కన పీకేఆర్ ఎస్టేట్ పేరుతో 11.78 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ వేశారు. ఆ వెంచర్‌కు ఎదురుగా దశాబ్దాలుగా కర్లపాలెం, ఏట్రవారిపాలెం పంచాయతీలకు సంబంధించిన చెత్తను పంచాయతీ సిబ్బంది పారబోస్తారు. వెంచర్‌కు ఎదురుగా డంపింగ్‌యార్డు ఉండటంతో వెంచర్‌లో ప్లాట్లు ఎవరూ కొనుగోలు చేయడం లేదు. దీంతో కర్లపాలెం, చింతాయపాలెం, సమ్మెటవారిపాలెం పంచాయతీలకు చెందిన ప్రధాన తాగునీటి చెరువులు, సాగునీటి కాలువల సమీపంలో వెంచర్ నిర్వాహకులు, హైదరాబాద్‌కు చెందిన పెనుమత్స కోటంరాజు కుమారుడు గాంధీరాజు ఆరు ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారు. దానిని కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు, సర్పంచ్ నక్కా లలితకుమారి పేరు మీద మార్చి 25న దానపత్రం అంటూ అగ్రిమెంట్ చేశారు. అగ్రిమెంట్‌లో డంపింగ్‌యార్డు మాత్రమే ఏర్పాటు చేయాలని స్పష్టంగా రాశారు. ఈ పొలాల్లో గత రెండేళ్ల కాలంలో అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా తవ్వకాలు చేసి ఇసుక, బుసక తోడేయటంతో భారీ లోతుతో పంట పొలాలు చెరువులుగా మారాయి. ఈ పొలాల్లో రాత్రికి రాత్రి వెంచర్ నిర్వాహకులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై చెత్త అంతా పొలాల్లో పారబోస్తున్నారు. దీంతో తమ పొలాలు విషతుల్యంగా మారి పంటలు పండవని, తాగునీటి చెరువులు కలుషితమవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కర్లపాలెం మండలంలోని 14 గ్రామాలకు చెందిన సాగునీటి కాలువలు, తాగునీటి చెరువుల

- మిగతా 2 లో

‘21వ శతాబ్దం సోషలిజం’ - ‘20వ శతాబ్దం సోషలిజం’ మధ్య తేడా ఏమిటి?

- అలెగ్జీ బ్రాజిన్

(నోట్: శాస్త్రీయ సోషలిజం అనుకూల వెబ్‌సైట్ రూసో నుంచి ఈ వ్యాసాన్ని తెలుగులో యథాతథంగా ఇస్తున్నాం. కొంతకాలంగా సోషలిజంపైనా సంబంధిత అంశాలపైనా ఈ వెబ్‌సైట్ చర్చలు ప్రారంభించింది. రష్యన్ మేధావులు, సోదర దేశాల కమ్యూనిస్టు పార్టీల నాయకులు, మేధావులు కూడా ఈ చర్చల్లో పాల్గొంటున్నారు.)

విభేదమల్లా ఒకే ఒక అంశంపై ఉన్నదని నేను నమ్ముతున్నాను. 20వ శతాబ్దంలో సోషలిజం... 20వ శతాబ్దానికి చెందిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిర్మితమైంది. 21వ శతాబ్దంలో సోషలిజం... 21వ శతాబ్దం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిర్మించబడుతుంది.

సోషలిజంలో ఆధునిక కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఆర్థిక ప్రణాళికలు ఉన్నత ప్రమాణాలను సాధించే అవకాశమున్నది. కేపిటలిజం పరిధిలో స్టేట్ ప్లానింగ్‌కి పరిమితులున్నాయి. నాటి సోవియట్ యూనియన్ రోజుల్లో ఆధునిక కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం లేదు.

నాటి సోవియట్ యూనియన్‌తో పోల్చితే శ్రమవనరుల పంపిణీ మారుతాయి. పరిశ్రమల చొరవ పెరుగుతుంది. విద్యాస్థాయి పెరుగుతుంది. ఆధునిక యంత్రాలను నడిపేందుకు కార్మికులకు ఉన్నత విద్యా ప్రమాణాలు అవసరం ఉంటుంది.

21వ శతాబ్దంలో సోషలిజంలో నగదు చెలామణి అవసరం ఉండదు. నగదురహిత బ్యాంకింగ్ వ్యవస్థకు అది మారుతుంది. ఇలాంటి చర్యల కారణంగా జనాభా వినిమయ స్థాయిని అంచనా కట్టడానికి, నియంత్రించడానికి వీలుకలుగుతుంది. సోషలిస్టు సమాజంలో ఇది అవసరం.

సోషలిజంలో సినిమాలు, సంగీతం, పుస్తకాలు తదితరాలు పౌరులందరికీ అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ ఉచితంగానే లభ్యమవుతాయి. కాపీరైట్ కారణంగా పౌరులకు సమాచారం తెలుసుకునేందుకు నిబంధనలు అడ్డువస్తాయి. ప్రభుత్వమే రచయితలకు పారితోషకాలు చెల్లిస్తుంది. మేథోశ్రమజనితమైన ఉత్పత్తులన్నీ సమాజానికి అందుబాటులోకి వస్తాయి.

ఇలాంటి సదుపాయాలు ఇంకా చాలా ఉన్నాయి.

నాటి సోవియట్ యూనియన్ పౌరుల జీవితాలతో పోల్చితే 21వ శతాబ్దపు సోషలిజంలో పౌరుల జీవితాలలో గణనీయమైన అభివృద్ధి ఉంటుంది. ఈ అభివృద్ధి ఫలితాలు ఆ సమాజంలో సాధించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సాధ్యం. ఇతర ముఖ్యాంశాల్లో సోషలిజం ప్రమాణాలలో మార్పులు ఉండవు.

అవేమిటో ఒకసారి గుర్తుచేసుకుందాం.

- సోషలిస్టు సమాజంలో కార్మికవర్గం నియంతృత్వం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ పాత్ర విధిగా ఉంటాయి.
- ఆర్థిక వ్యవస్థలో బహుళ రూపాలు ఉండవు. ఉత్పత్తి సాధనాలపై సమాజ యాజమాన్యం ఉంటుంది. దాని అర్థం ప్రభుత్వ యంత్రాంగం లేదా సమిష్టి యాజమాన్యం.
- ‘ప్రతి ఒక్కరు శక్తి అనుసారం, ప్రతి ఒక్కరికి పనినిబట్టి’ సూత్రం అమల్లోకి వస్తుంది.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంటుంది.
- కేంద్రీకృత ప్రణాళికాబద్ధ జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుంది.
- దోపిడీ నిర్మూలన సాధ్యమవుతుంది.
- సోషలిస్టు సమాజంలో రెండు స్నేహవర్గాలు ఉంటాయి. శ్రమజీవులు, సహకార రంగంలో పనిచేసే రైతాంగం. ఈ రెండు వర్గాల మధ్య ఒక దొంతర ఉంటుంది. శ్రమించే మేధావివర్గం...
- ఈ వర్గాల మధ్య వ్యతిరేకత ఉండదు.
- నగరాలకు, గ్రామీణ ప్రాంత్రాలకు మధ్య భేదాలు క్రమంగా తొలగిపోతాయి.
- మానసిక శ్రమ, శారీరక శ్రమ మధ్య సఖ్యత ఏర్పడుతుంది. టర్కీ, గ్రీస్ ప్రజలకు
- శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ అవశ్యం
- అందుకే దానిని గెలిపించుకోవాలి

కేకేఈ కేంద్ర కమిటీ సభ్యులు థనాసిస్ పాఫిలిస్ పిలుపు

అంకారా: ప్రస్తు పరిస్థితుల్లో టర్కీ, గ్రీస్ ప్రజలకు శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ అవసరమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమటీ సభ్యులు, ఎంపీ థనాసిస్ పాఫిలిస్ నొక్కిచెప్పారు. అంకారాలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో కేకేఈ ప్రతినిధి బృందం పాల్గొన్నది. ఆ దేశంలో అధ్యక్ష ఎన్నికలు మే 14న జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత ఏర్పడింది. థనాసిస్ ప్రసంగిస్తూ నేడున్న పరిస్థితులు, రాజకీయ పరిణామాల దృష్ట్యా శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ అవసరం ప్రజలకు ఎంతైనా ఉందని చెప్పారు. ‘గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ తరపున టర్కీ కమ్యూనిస్తు పార్టీ సభ్యులు, కార్యకర్తలు, స్నేహితులకు సౌహార్థపూర్వకంగా అభివాదం చేస్తున్నా’ అని ప్రసంగాన్ని ప్రారంభించారు. తమను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మేలో టర్కీ, గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలను ఎదుర్కోనున్నాయని, రెండు దేశాల్లో వారం తేడాలో ఎన్నికల పోరు జరగనున్నదని థనాసిస్ పఫిలిస్ అన్నారు.

నేడున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులకు ఓటేయడమంటే ఏమిటి? పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ పేట్రేగిపోతూ, ప్రజలు సామ్రాజ్యవాద యుద్ధంలోకి నెట్టిబడుతుండటమే కాకుండా ఉక్రెయిన్‌లో అమెరికా-నాటో-ఈయూ, రష్యా, దాని మిత్రపక్షాల మధ్య యుద్ధం క్రమంలో టర్కీ, గ్రీస్‌లో కమ్యూనిస్టులకు ఓటు వేయడమంటే అర్థమేమిటి?

- ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం నేపథ్యంలో ప్రజల ఆదాయం ఆవిరవుతుండటాన్ని వ్యతిరేకించడమే ఈ ఓటు.
- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన. ఇటువంటి అనాగరిక-ఆటవిక పరిపాలనా వ్యవస్థను మార్చవచ్చు, మానవీకరించవచ్చు అనే సోషల్ డెమోక్రటిక్ పార్టీలు సృష్టించే భ్రమలకు ఖండన.
- ప్రైవేటీకరణకు - వేతనాలు, పింఛన్లలో కోతలకు వ్యతిరేకం. సామాజిక లాభాల తొలగింపునకు వ్యతిరేకం.
- సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా, అమెరికా స్థావరాలకు వ్యతిరేకంగా, అణ్వాయుధాలకు వ్యతిరేకంగా, నాటో, ఇతర సామ్రాజ్యవాద కూటములకు వ్యతిరేకించడమే ఈ ఓటు’ అని ఆయన ఉద్ఘాటించారు.

మతతత్వవాద, సామాజిక ప్రజాస్వామిక ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతిదానికీ వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

‘రెండు దేశాలలోని కమ్యూనిస్టులది ఒకటే అజెండా. అది ప్రజలకనుగుణంగా మార్పు తేగలదు. మనిషి మనిషిని దోపిడీ చేయని సమాజం కోసం మనం పోరాడుతున్నాం. పెట్టుబడిదారుల లాభాలను కాకుండా ప్రజల సమకాలీన అవసరాలను తీర్చే సమాజం వ్యవస్థీకృతమైంది. అటువంటి సమాజానికి, సోషలిస్టు-కమ్యూనిస్టుకు, ఉత్పత్తి సాధనాల సాంఘికీకరణ, ఆర్థిక వ్యవస్థ కేంద్ర శాస్త్రీయ ప్రణాళిక, కార్మికుల నియంత్రణ అవసరం. రెండు దేశాలలో కమ్యూనిస్టు -కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయాలి. బూర్జువ పాలకుల మెడలు వెంచాలి’ అని థనాసిస్ పాఫిలిస్ పిలుపునిచ్చారు.

కేకేఈ ఎన్నికల నినాదం ‘పెట్టుబడిదారీ విధానాన్ని పారద్రోలాలి, శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీతో ప్రజలకు రక్షణ’ అని ఆయన తెలిపారు. టర్కీలోని శ్రామిక వర్గానికి టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఉన్నదని, దానికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

కమ్యూనిస్టు పార్టీని గెలిపించుకోవాలని కోరారు. లాంగ్ లివ్ టీకేపీ (టర్కీ కమ్యూనిస్టు పార్టీ), కేకేఈ (గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ), లాంగ్ లివ్ ప్రొలెటేరియన్ ఇంటర్నేషనలిజం!” అని వేదికపై నుంచి ఆయన నినాదాలిచ్చారు.

విపక్ష ఐక్యతకు ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

కొత్త దిశానిర్దేశం చేస్తాయని అన్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ విపక్షాలు కలిసి దేశం పట్ల తమ దృక్పథాన్ని పెంపొందించుకుంటాయని, ప్రస్తుతం జరుగుతున్న సైద్ధాంతిక పోరులో కలిసి పోరాడుతున్నప్పుడు ప్రజల ముందు అదే విషయాన్ని తెలియజేస్తాయని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాబోయే కొద్ది రోజుల్లో వివిధ ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలతో సమావేశం కానున్నందున వచ్చే ఏడాది ఎన్నికలకు ముందు ప్రతిపక్ష ఐక్యతను ఏర్పరచడంలో ఇది మొదటి అధికారిక ప్రయత్నం. తనతో పాటు విలేకరుల సమావేశంలో కూర్చున్న నితీశ్, తేజస్వి, ఇతరుల కృషిని కొనియాడుతూ ఇక్కడ చారిత్రక సమావేశం నిర్వహించామని, అనేక అంశాలపై చర్చించామని, అన్ని పార్టీలను కలుపుకుని వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకున్నామని, ఇందుకోసం అందరం కృషి చేస్తామని రాహుల్ చెప్పారు. సమావేశానికి హాజరైన నాయకులు ఉమ్మడి ఆలోచనతో పనిచేస్తారని, ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు ఈ సమావేశాన్ని ఒక చారిత్రక అడుగుగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఎన్ని ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వస్తాయన్న ప్రశ్నకు, ‘ఇది ఒక ప్రక్రియ, మేము దేశం పట్ల ప్రతిపక్ష దృష్టిని అభివృద్ధి చేస్తాం. మాతో కలిసి వచ్చే అన్ని పార్టీలు, దేశంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటాన్ని కలిసి చేస్తాం’ అని తెలిపారు. ‘సంస్థలపై దాడికి, దేశంపై దాడికి వ్యతిరేకంగా మేము ఐక్యంగా నిలబడతాం’ అని అన్నారు. ఈ రోజు చాలా ముఖ్యమైన అడుగు పడిందని చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఒకే వేదికపైకి వచ్చే ఆలోచనలున్న ప్రతిపక్ష పార్టీల చర్చల మధ్య ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరిగింది. బీహార్ ముఖ్యమంత్రి మాట్లాడుతూ ‘దేశంలో మరిన్ని పార్టీలను ఏకం చేయడానికి మేము అన్ని ప్రయత్నాలు చేస్తాం. కలిసి కూర్చుని, ఐక్యంగా పని చేస్తాం’ అని అన్నారు. ‘నేటి చర్చల అనంతరం ఆ ప్రాతిపదికన ముందుకు సాగుతాం. అంగీకరించే వారందరూ కలిసి కూర్చొని భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తాం’ అని తెలిపారు. ఖర్గే హిందీలో ఒక ట్వీట్ చేశారు. ‘రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం. రాహుల్ గాంధీ, మేము నితీశ్ కుమార్, తేజస్వి యాదవ్, ఇతర నాయకులను కలిశాం. కలిసికట్టుగా ప్రజల గొంతుకను పెంచి దేశానికి కొత్త దిశా నిర్దేశం చేస్తామని పునరుద్ఘాటించారు’ అని ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే నివాసంలో జరిగిన విందు సమావేశానికి జేడీ(యూ) అధ్యక్షుడు లాలన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ బీహార్ అధ్యక్షుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్, కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్, ఆర్‌జేడీ నాయకుడు మనోజ్ ఝా హాజరయ్యారు. బీహార్‌లో జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంలో ఇతర ప్రతిపక్ష పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి మూడు పార్టీలు చర్చలు జరుపుతున్నాయి. మంగళవారం ఇక్కడకు వచ్చిన నితీశ్ కుమార్, దేశ రాజధానిలో ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకులను కలవాలని భావిస్తున్నారు. ఉద్యోగాల కోసం భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరయ్యేందుకు తేజస్వి యాదవ్ కూడా దిల్లీలో ఉన్నారు. బీజేపీని ఎదుర్కోవడానికి భావసారూప్యత గల పార్టీల మధ్య ఐక్యతను పెంపొందించే ప్రయత్నంలో ఖర్గే ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, ఉద్ధవ్ థాకరేతో సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ఆయన ఇతర ప్రతిపక్ష అగ్రనేతలతో చర్చించే అవకాశం ఉంది. అలాగే కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలను తగ్గించడం నితీశ్ కుమార్ మూడు రోజుల రాజధాని పర్యటన అజెండాలో ఉన్నట్లు కనిపిస్తోంది. తన పర్యటనలో నితీశ్, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్, వామపక్ష అగ్ర నేతలతో సహా ప్రతిపక్ష నాయకులను కలవనున్నారు.

సీపీఐ జాతీయ పార్టీయే

సిక్కిం, నాగాలాండ్ మినహా దేశవ్యాప్తంగా శాఖలున్నాయ్

మూడు రాష్ట్రాల్లో అధికార కూటమిలో భాగస్వామ్యమున్నది

సురవరం సుధాకరరెడ్డి

హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ పార్టీ అని, దానినీ ఎవరూ కాదనలేరని పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి నొక్కిచెప్పారు. సిక్కిం, నాగాలాండ్ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీపీఐ శాఖలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా సీపీఐ కేడర్ క్రియాశీల ఉద్యమాలు సాగిస్తున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తాజాగా సీపీఐకి జాతీయ పార్టీ హోదాను రద్దు చేయడంపై ఆయన బుధవారం ఓ ప్రకటన చేశారు. ఈసీఐ సాంకేతిక కారణాలు ఏమైనాగానీ వ్యవస్థాగతంగా దేశవ్యాప్తంగా నెట్వర్క్ ఉన్న సీపీఐ కచ్చితంగా జాతీయ పార్టీ అని సురవరం పేర్కొన్నారు. గతంలో అనేకమార్లు క్లిష్ట పరిస్థితులను సీపీఐ ఎదుర్కొన్నది, సమర్థంగా అధిగమించింది. ఇప్పుడు కూడా మరింత ఉధృతంగా పోరాటాలు సాగిస్తుంది. తిరిగి పుంజుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. ‘ఈసీఐ సాంకేతిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని సీపీఐకి జాతీయ పార్టీ హోదాను రద్దు చేసింది. అదే సమయంలో లోక్‌సభలో సీట్లు లేని, కేవలం పక్క రాష్ట్రాల్లో కాస్తంత బలం పుంజుకున్న పార్టీలకు జాతీయ పార్టీ హోదాను కల్పించింది. ఇటీవల ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ సీపీఐకి లోక్‌సభ, రాజ్యసభలో సభ్యులు ఉన్నారు. మూడు రాష్ట్రాల్లో అధికార కూటముల్లో సీపీఐ భాగస్వామిగా ఉంది. 26 రాష్ట్రాలు, తొమ్మిది కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభలు, శాసనమండళ్లలో సీపీఐకి సభ్యులున్నారు. స్థానిక సంఘాల్లోనూ వేలాది మంది ప్రతినిధులు ఎన్నికయ్యారు. 20 మిలియన్ల అనుచరులు (ఫాలోవర్స్), 6.5లక్షల మంది క్రియాశీల నిబద్ధతగల కార్యకర్తలు సీపీఐ సొంతం. సీపీఐకి ఘన చరిత్ర ఉన్నది. మెరుగైన సమాజం కోసం శాస్త్రీయబద్ధ దృష్టికోణంతో ముందుకు సాగుతోంది. నిషేధం ఉన్నాగానీ బ్రిటిష్ సామ్రాజ్యం పునాదులను కుదిపివేసిన పార్టీ ఇది. నిజమైన కమ్యూనిస్టు పార్టీ ఓ అంతర్జాతీయ పార్టీ, భారత మొట్టమొదటి కమ్యూనిస్టు పార్టీ సీపీఐ. మెరుగైన దేశం కోసం ప్రతి పౌరుని వికాసం కోసం సీపీఐ మళ్లీ పుంజుకుంటుంది. అందరికి విద్యా, ఆరోగ్యం కోసం నిర్విరామంగా పాటుపడుతోంది. హిందూత్వ శక్తులపై పోరాడే చరిత్రాత్మక బాధ్యత మనపై ఉంది. అలాగే లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం మన కర్తవ్యం’ అని సుధాకర రెడ్డి నొక్కిచెప్పారు.

అభివృద్ధికి గుదిబండ జగన్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అదానీతో జగన్ కుమ్మక్కయ్యారని, ఆయనకు వేల కోట్ల రూపాయల భూములు ధారాదత్తం చేశారన్నారు. మోదీ, అదానీ, జగన్ ఒక టీమ్‌గా ప్రభుత్వ ఆస్తులు దోచేస్తున్నారని దుయ్యబట్టారు. వాటిని తాము బయట పెడితే టీడీపీకి మద్దతిస్తున్నామని ఏడుస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. విశాఖ స్టీలు ఫ్యాక్టరీ వ్యవహారంపై తెలంగాణ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలకు సీఎం జగన్ సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ అచ్చెన్న హత్యపై అనేక అనుమానాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని రామకృష్ణ మండిపడ్డారు. డాక్టర్ అచ్చెన్న హత్యపై పోలీసుల స్పందన అనుమానంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పోస్టుమార్టం ఎలా చేశారని ప్రశ్నించారు. జిల్లాస్థాయి అధికారి విషయంలోనే ఇలా వ్యవహరిస్తే...సామాన్య ప్రజలను ఏం పట్టించుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. అచ్చెన్న కుటుంబీకులను సీఎం, హోంమంత్రి కనీసం పరామర్శించలేదన్నారు. దళితుడు కాబట్టే ప్రభుత్వ పెద్దలకు చిన్నచూపుగా ఉందని వ్యాఖ్యానించారు. దళిత, మైనార్టీలపై కొనసాగుతున్న దాడులను నిరసిస్తూ అఖిలపక్షం, ప్రజాసంఘాలతో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

‘మా భవిష్యత్తు నువ్వే జగన్’ అంటూ....ఇంటి డోర్లపై బలవంతంగా స్టిక్కర్లను వైసీపీ ఎమ్మెల్యేలు, శ్రేణులు అంటించడాన్ని రామకృష్ణ తీవ్రంగా వ్యతిరేకించారు. బెయిల్ రద్దు అయితే జగన్ ఏ జైలుకు పోతారో తెలియదని వ్యాఖ్యానించారు. ఇంటింటికీ స్టిక్కర్లు వేయడాన్ని తప్పుపట్టారు. జగన్‌కు ప్రచారపిచ్చి పరాకాష్ఠకు చేరిందని, ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ప్రజల సొంత ఆస్తులపై జగన్, వైసీపీ బొమ్మలతో పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. తరతరాలుగా వస్తున్న ఆస్తుల హక్కు పత్రాలపైనా జగన్ ఫోటోలు వేయడాన్ని తప్పుపట్టారు.

రైతు నోట్లో రియల్టర్ ‘చెత్త’

(మొదటిపేజీ తరువాయి)

మధ్యలో ఉన్న పొలాల్లో చెత్త పారబోస్తున్నా అధికారులు అధికారులు పట్టించుకోవడం లేదు. అన్నదాత ఆర్తనాదాలు వినిపించుకోవటం లేదు. వ్యాపార, వాణిజ్య రంగంలో పేరొందిన కర్లపాలెం మేజర్ పంచాయతీలో 23 వేల మంది జనాభా ఉన్నారు. దీంతో రోజుకు 8 టన్నుల మేర వ్యర్థాలు, చెత్త వస్తుంది. దీంతోపాటు ఐలాండ్ సెంటర్లో ప్రధాన మార్కెట్, ఆక్వా ఉత్పత్తుల దుకాణాలు ఉండటంతో వాటి వ్యర్థాలు అన్నీ కలిపి డంపింగ్ యార్డ్‌లో పడేస్తారు. వెంచర్ నిర్వాహకుడికి అండగా కాసులకు కక్కుర్తి పడిన అధికారులు స్థిరాస్తి అధికారులతో కుమ్మక్కై పంటపొలాలను చెత్తతో నింపేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికార పార్టీ నేతల సహకారంతో అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కాలంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఇదే వెంచర్‌లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం భారీ ఎత్తున జరిపారు. మరోవైపు వెంచర్ నిర్వహకులు అధికార పార్టీ నేతలకు నగదుతో పాటు ప్లాట్లు ఇచ్చారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నేతల అండ ఉండటంతో రైతుల గోడు పట్టించుకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతులు తమకు జీవనాధారమైన పొలాల్లో చెత్త పారబోయొద్దని అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ బాధిత రైతులతో కలిసి పొలాల మధ్య చెత్తవేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతుల పంటపొలాల్లో చెత్త పారబోస్తే సహించేది లేదని ముక్తకంఠంతో హెచ్చరించారు. రాజులు రంగప్పల ప్రయోజనాల కోసం రైతులను ఇబ్బందులు పెడితే మూల్యం చెల్లించుకుంటారని తెలిపారు. ఇందులో భాగంగా గత సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో జేసీ శ్రీనివాసులుకు రైతులతో వినతిపత్రం అందజేశారు. మరోవైపు సమ్మెటవారిపాలెం, చింతాయపాలెం సర్పంచ్‌లు నాగాంజనేయరెడ్డి, శ్రీనివాసరావు కూడా చెత్తపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

భూమి విషతుల్యమై పంటలు పండవు: ఆట్ల శివచలమారెడ్డి-కర్లపాలెం



పంట పొలాల మధ్యలో చెత్త వ్యర్థాలు వేయటం వలన భూమి విషతుల్యమై పంటలు పండవు. మాకు జీవనాధారమైన పంట పొలాలను నాశనం చేస్తే మేము బ్రతికేది ఎలా? వెంటనే పొలాల మధ్య పారబోసిన చెత్తను తొలగించి డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలి

డంపింగ్ యార్డు నిలిపివేసేంత వరకు పోరాటం: తన్నీరు సింగరకొండ (సీపీఐ జిల్లా కార్యదర్శి)



స్థిరాస్తి వ్యాపారి స్వార్థం కోసం అధికారులు, అధికార పార్టీ నేతలు 14 గ్రామాల రైతులకు చెందిన పంట పొలాలు, తాగునీటి చెరువుల మధ్య చెత్తవ్యర్థాలు వేయటం సరైన విధానం కాదు. డంపింగ్ యార్డు నిలిపివేసి ఇక్కడ నుంచి తొలగించేంత వరకు సీపీఐ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది.

కేషుబ్ మహీంద్ర మృతి

ముంబై: పారిశ్రామిక దిగ్గజం, మహీంద్రా అండ్ మహీంద్రా ఎమెరిటస్ చైర్మన్ కేషుబ్ మహీంద్ర (99) బుధవారం ఉదయం మృతిచెందారు. ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్ కే గోయంకా ట్విటర్ ద్వారా కేషుబ్ మహీంద్ర మృతి చెందినట్లు ప్రకటించారు. మహీంద్ర తన నివాసంలో ప్రశాంతంగా కన్నుమూశారని తెలిపారు. ‘సిద్ధాంతాలకు కట్టుబడే వ్యక్తి.. మహీంద్ర వారసత్వాన్ని కాపాడుకుంటూ వ్యవస్థను ముందుకు నడిపించారు. మంచి విలువలతో మంచి కార్పొరేట్ పాలనను అందించారు’ అని మహీంద్ర గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్ర పేర్కొన్నారు. కేషుబ్ మహీంద్ర మృతికి సంతాపాన్ని ప్రకటించారు. గోయంకా ట్విట్టర్ ద్వారా సంతాపం తెలిపారు. పారిశ్రామిక ప్రపంచం నేడు అత్యంత ఉన్నతమైన వ్యక్తిని కోల్పోయిందని, వ్యాపారం, ఆర్థిక శాస్త్రం, సామాజిక విషయాల్లో స్ఫూర్తిదాయకమైన వ్యక్తి కేషుబ్ మహీంద్ర అని ట్వీట్ చేశారు. 1923, అక్టోబరు 9న సిమ్లాలో జన్మించిన కేషుబ్ మహీంద్ర అమెరికాలోని పెన్సల్వేనియా యూనివర్సిటీ, వాహర్టన్ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. 1947లో మహీంద్ర గ్రూప్‌లో చేరారు. 1963లో కంపెనీకి చైర్మన్ అయ్యారు. ఆనంద్ మహీంద్రకు ఈయన మేనమామ. మహీంద్ర గ్రూపులో 1963 నుంచి 2012 (64ఏళ్లు) వరకు చైర్మన్‌గా సేవలందించారు. పదవీ విమరణ తరువాత తన వారసుడిగా ఆనంద్ మహీంద్రకు బాధ్యతలు అప్పగించారు. కేషుబ్ మహీంద్ర హుడ్కో వ్యవస్థాపక చైర్మన్ కూడా. సెయిల్, టాటా స్టీల్, టాటా కెమికల్స్, ఇండియన్ హోటల్స్, ఐఎఫ్‌సీ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి అనేక కార్పొరేట్ కంపెనీల బోర్డుల్లో ఉన్నారు.

సంపన్న సీఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

జమ్ముకశ్మీర్‌కు ప్రస్తుతం ముఖ్యమంత్రి లేరు. ఏడీఆర్ నివేదిక ప్రకారం...30 మంది ముఖ్యమంత్రుల్లో 13 మంది(43 శాతం)పై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, క్రిమినల్ బెదిరింపులు సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. అవి ఐదేళ్లకు పైగా జైలు శిక్ష పడే నాన్ బెయిలబుల్ నేరాలు అని నివేదిక తెలిపింది. జగన్‌మోహన్ రెడ్డి (రూ.510 కోట్లకు పైగా), అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పెమా ఖండూ (రూ.163 కోట్లకు పైగా), ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ (రూ.63 కోట్లకు పైగా) ఆస్తులతో అగ్రభాగాన ఉన్నారు. ఇక ఆస్తులను అత్యల్పంగా ప్రకటించిన ముగ్గురు ముఖ్యమంత్రులలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (రూ.15 లక్షలకు పైగా), కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ (కోటికి పైగా), హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ (కోటికి పైగా) ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌లకు రూ.3 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి.

మళ్లీ మాటల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అంటూ హెచ్చరించారు. మా గురించి ఎక్కువ మాట్లాడకపోతే మీకే మంచిదని హితవు పలికారు. దీనిపై మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఘాటుగా ప్రతిస్పందించారు. హరీశ్‌రావు రాజకీయాల కోసం ఏదైనా మాట్లాడతాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఏపీ గురించి మాట్లాడడానికి ఆయనకు ఏ సంబంధమని ప్రశ్నించారు. బాధ్యత గల వ్యక్తులు బాధ్యత గుర్తెరిగి మాట్లాడాలని సూచించారు. ‘మా రాష్ట్రం గురుంచి మాకు తెలుసు. మీ రాష్ట్రం మీరు చూసుకోండి’ అని హితవు చెప్పారు. మొత్తానికి విశాఖ ఉక్కు అంశం రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ వేడి పుట్టిస్తోంది.

సైనిక స్థావరంలో కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఖురానా మీడియాకు చెప్పారు. భటిండా మిలటరీ స్టేషన్ నుంచి రెండు రోజుల క్రితం రైఫిల్, బుల్లెట్లు అదృశ్యమయ్యాయి. ఈ విషయమై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ సమయంలోనే ఇవాళ తెల్లవారుజామున కాల్పులు చోటుచేసుకున్నాయి. భటిండా సైనిక స్థావరంలో కాల్పుల ఘటనపై కేంద్ర రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమీక్ష నిర్వహించారు. కాల్పుల్లో ఎలాంటి ఉగ్రవాద కోణం లేదని పంజాబ్ పోలీసులు చెబుతున్నారు. ఇది సహచరులు జరిపిన కాల్పులుగా అనుమానిస్తున్నారు. ఇదిలా ఉంటే సమీప గ్రామాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సైనికాధికారులు సూచించారు. ఈ ఘటన సైనిక కేంద్రంలోని శతఘ్ని విభాగంలో చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ ఉన్న ఒక ఆఫీసర్స్ మెస్‌లో ఇది జరిగినట్లు భావిస్తున్నారు. ఆ ప్రదేశంలోనే సైనికుల కుటుంబాలు నివసిస్తున్నాయి. పౌర దుస్తుల్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందగానే పంజాబ్ పోలీసులు సైనిక స్థావరం వద్దకు చేరుకున్నారు. అయితే ఆ ప్రాంతాన్ని సైనికాధికారులు తమ అధీనంలోకి తీసుకోవడంతో వారిని లోపలికి అనుమతించలేదని భటిండా సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ వెల్లడించారు. కాల్పుల ఘటనలో ఉగ్రకోణం ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. భటిండా వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సైనిక స్థావరం. ఇక్కడ కీలకమైన 10వ కోర్ కమాండ్‌కు చెందిన దళాలు ఉన్నాయి. జైపూర్ కేంద్రంగా పని చేసే సౌత్ వెస్ట్రన్ కమాండ్ అధీనంలో ఈ స్థావరం పని చేస్తుంది. భటిండాలో పెద్ద సంఖ్యలో ఆపరేషనల్ సైనిక యూనిట్లు, ఇతర కీలక పరికరాలు ఉన్నాయి. ఇదిలాఉండగా, భటిండా హత్యలు భద్రతా బలగాల్లో సహచరుల హత్య ఘటనలు ఎందుకు చోటుచేసుకుంటాయనే ప్రశ్నను మరోసారి లేవనెత్తింది. 2014 -మార్చి 21, 2021 మధ్య భారత సైన్యంలో 18 సహచరుల హత్యలు, రెండు భారత వైమానిక దళంలో జరిగినట్లు నివేదించబడింది. జులై 2022లో జమ్ముకశ్మీర్‌లోని పూంచ్‌లోని సరిహద్దు జిల్లా సూరన్‌కోట్‌లోని సైనిక శిబిరంలో సహచరులు జరిపిన హత్య సంఘటనలో ఇద్దరు సైనికులు మరణించారు. ఇద్దరు గాయపడ్డారు. అయితే, సైన్యం, వైమానిక దళం, నావికాదళంతో పోలిస్తే కేంద్ర సాయుధ బలగాలు (సీఏపీఎఫ్) సోదర హత్యలు, ఆత్మహత్య కేసులు చాలా ఎక్కువ. గత ఐదేళ్లలో (2018 నుంచి 2022 వరకు) 29 మంది కేంద్ర సాయుధ బలగాల సిబ్బందిని వారి సహచరులు చంపారు.

పర్యాటక రంగానికి నూతనోత్తేజం

మంత్రి ఆర్కే రోజా

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి నూతనోత్తేజం వచ్చిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం ఆమె రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖలపై విజయవాడ బెర్మ్ పార్క్ లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ... జీఐఎస్ ద్వారా ఏపీ ప్రభుత్వం బ్రాండ్ అంటే ఏంటో పారిశ్రామికవేత్తలకు తెలిసిందని, అందుకే టూరిజం, ఆతిథ్య రంగాలలో రూ.21,941 కోట్లతో 123 ఎంఓయూలు కుదుర్చుకున్నామన్నారు. దీని ద్వారా 41,412 మంది రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఎంఓయూల్లో 40 డీపీఆర్ లు ఇప్పటికే సమర్పించడం జరిగిందన్నారు. పెట్టుబడులకు ముందుకు వచ్చినవారికి సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేకంగా కమిటీలను సైతం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పర్యాటకులు రావడం జరిగిందన్నారు. తాను మంత్రిగా ఉన్న సంవత్సరకాలంలో ఎన్నడూ లేనివిధంగా పర్యాటక, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, జీ20 సదస్సుల్లో కళాకారులచే చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. క్రీడాకారులను కూడా ప్రోత్సహించేలా క్రీడా సంబరాలు నిర్వహించామని వారికి కూడా రూ.50 లక్షల ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగిందని మంత్రి రోజా చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 15 నుంచి శాప్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. యూత్ ఫెస్టివల్స్ వల్ల యువతకు తగిన ప్రోత్సాహం లభించడంతో పాటు సరైన మార్గంలో నడిచేందుకు దోహదం చేస్తాయన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని కాలేజీల్లో, స్కూళ్లలో ఈవిటీజింగ్ పూర్తిగా అరికట్టారని, రాష్ట్రంలో డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపారన్నారు. ఈ సమీక్షా కార్యక్రమంలో పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత భార్గవ, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్ రెడ్డి, బలరాం రెడ్డి, క్రీడా ప్రాధికారిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్, యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదా దేవి, రాష్ట్ర సాంస్కృతిక ముఖ్య కార్యనిర్వాహణాధికారి మల్లికార్జున, శిల్పారామం ముఖ్య కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, పర్యాటక శాఖ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి రాముడు, ఎస్సీసీ అధికారులతో పాటు జిల్లా స్థాయి పర్యాటక, క్రీడా యువజన సర్వీసుల, బెర్మ్ పార్క్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఎస్పీడీగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులుగా బి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2018-ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు సంచాలకులుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఐఏఎస్ బదిలీల్లో భాగంగా ఎస్పీడీగా నియమితులయ్యారు. ఇది వరకు ఎస్పీడీ స్థానంలో ఉన్న పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ ఇక నుంచి పూర్తిస్థాయి పాఠశాల విద్య కమిషనర్‌గా ఉండటంతోపాటు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి మరింత కృషిచేస్తానన్నారు.

కార్మికవర్గ సమస్యలు పరిష్కరించండి

ఘనంగా ఏఐటీయూసీ గుంటూరు జిల్లా మహాసభ

విశాలాంధ్ర-మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమా లకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా మహాసభలో వక్తలు పిలు పునిచ్చారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మరింత ఉధృతంగా పోరాడాలని నొక్కిచెప్పారు. కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఏఐటీయూసీ ఏపీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళగిరిలో ఏఐటీయూసీ 16వ గుంటూరు జిల్లా మహాసభ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్వర్యంలో ఎయిమ్స్ ప్రధాన ద్వారం నుంచి గౌతమ్ బుద్ధ రోడ్డు, తెనాలి రోడ్డు మీదుగా సీపీఐ కార్యాలయం వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వేములపల్లి శ్రీకృష్ణభవన్ వద్ద ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ ఆవిష్కరించారు. వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లోని కామ్రేడ్ షేక్ దస్తగిరి మహాసభ ప్రాంగణంలో జిల్లా మహాసభను నిర్వహించారు. ఆకిటి అరుణ్‌కుమార్, చిన్ని సత్యనారాయణ, పి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ ఏపీ ప్రధాన కార్యదర్శి ఓబులేసు, గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏఐటీయూసీ ఘన చరిత్రను గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, నేటి వరకు కార్మికుల పక్షాన పోరాడుతూ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మికులు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగంలోని హమాలీ, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనిభద్రత, కార్మిక చట్టాలు అమలు, 60 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ.3వేల పింఛన్, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాల బాధ్యత మనపై ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం ప్రైవేటుపరం చేయనుందని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ మంగళ గిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బందెల రవి వక్తల్లో ఉన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, వి.బాలయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, పంతగాని మరియదాసు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకటయ్య, గుంటూరు జిల్లా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, ఆటో వర్కర్స్ యూని యన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక, చేనేత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: ఏఐటీయూసీ గుంటూరు జిల్లా నూతన కమిటిని ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా ఆకిటి అరుణ్‌కుమార్, కార్యదర్శిగా మేడా హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు 45 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది.

దేశాన్ని కాపాడుకుందాం

ప్రచారభేరిని జయప్రదం చేయండి

సీపీఐ, సీపీఎం నాయకుల పిలుపు

విశాలాంధ్ర- రాయచోటి: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు ప్రచారభేరి గోడ పత్రికలను విడుదల చేశారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపాలని, దేశాన్ని కాపాడుకుందామని ఏప్రిల్ 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో జరిగే ప్రచారభేరిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ, అమిత్ షా నాయకత్వంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేష చిచ్చు రాజేస్తున్నదని విమర్శించారు. మరోవైపు అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచివేస్తున్నదన్నారు. మోదీ ప్రభుత్వం ఇంత అన్యాయం చేస్తున్నా గట్టిగా నిలదీయలేని దౌర్భాగ్య స్థితిలోకి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయిందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అటువంటి మహోద్యమం నిర్మించడానికి వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం ముందుకొస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, విశ్వనాథ్ నాయక్, జ్యోతి చిన్నయ్య, కోటేశ్వరరావు, సుమిత్రమ్మ మురళి, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవరా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజులపై వడ్డీలు దుర్మార్గం

- నారాయణ కళాశాల యాజమాన్యం తీరుపై ఏఐఎస్ఎఫ్
- పద్ధతి మార్చుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: నారాయణ యాజమాన్యం కళాశాలలను నడుపుతుందా లేక వడ్డీ వ్యాపారం చేస్తోందా అని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రస్థాయిలో విమర్శించింది. విద్యారంగాన్ని వడ్డీ వ్యాపారంగా నారాయణ కళాశాల యాజమాన్యం మారుస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫీజులపై వడ్డీలు వసూలు చేయాలనుకోవటం దుర్మార్గమన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే ప్రవేశాలను చేపట్టి, ఫీజు నియంత్రణ కమిటీ నిర్ణయించినదానికంటే ఎక్కువగా వసూలు చేస్తోందని అన్నారు. ఫీజులను చెల్లించేందుకు కొత్తగా ఈఎంఐ పద్ధతిని తీసుకొచ్చిందని, ఇందుకు మూడు స్లాబులు తెచ్చిందన్నారు. మొదటి స్లాబ్‌లో ఆరు నెలల్లో చెల్లిస్తే వడ్డీ ఉండదు. తొమ్మిది నెలల్లో చెల్లిస్తే 2శాతం, 11 నెలల్లో చెల్లిస్తే 3.5శాతం వడ్డీ పడుతుంది. ఇది దుర్మార్గ పద్ధతి అని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని బాబు డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ కమిటీ కమిషనర్ వెంటనే నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగళ్ల సాయికుమార్ డిమాండ్ చేశారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి కాకుండానే ఇంటర్మీడియేట్ అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేయటం తగద న్నారు. ఎండాకాలంలో తరగతులు నిర్వహించ కుండా ఇంటర్మీడియేట్ బోర్డు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. నారాయణ విద్యా సంస్థలు పద్ధతి మార్చుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిం చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, అయ్యప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.

చలో అమరావతి చేపడతాం

జర్నలిస్టు స్థలాల్లో అక్రమ తవ్వకాలు అరికట్టకుంటే

- అధికార పార్టీ ఎమ్మెల్యేల ప్రోద్భలంతోనే తవ్వకాలు
- అక్రమార్కులను అరెస్టు చేయాలి
- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వి.సుబ్బారావు, చందు జనార్ధన్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : జర్నలిస్టుల స్థలాల్లో తవ్వకాలు నిలిపి వేయకపోతే చలో అమరావతి చేపట్టి ముఖ్యమంత్రి ఇంటి ముందే దీక్షలు చేపడతామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.వి.సుబ్బారావు, చందు జనార్ధన్ హెచ్చరించారు. బుధవారం జగన్నాథ గట్టులోని జర్నలిస్టుల స్థలాల్లో తవ్వకాలు జరిపిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న డిమాండ్ మేరకు 2009లో అప్పటి ప్రభుత్వం జగన్నాథ గట్టులో 15.44 ఎకరాలను అప్పటి మార్కెట్ రేటు ప్రకారం రూ.65 లక్షలకు ది కర్నూల్ జర్నలిస్ట్స్ మ్యూచివల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి కేటాయించిందని తెలిపారు. దీంతో సొసైటీ నిర్వహకులు ఒక్కో జర్నలిస్టుకు 3.50 సెంట్ల ప్రకారం 254 మందికి కేటాయించారన్నారు. అయితే ఎర్రమట్టి మాఫియా జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల్లో తవ్వకాలు చేపట్టడం దుర్మార్గమన్నారు. రూపాయి రూపాయి కూడపెట్టి డబ్బులు పోసి కొనుగోలు చేసిన స్థలాల్లో తవ్వకాలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అక్రమ తవ్వకాల వల్ల సుమారు 60 ప్లాట్లు నిర్మాణానికి పనికిరాకుండా పోయాయని అన్నారు. రాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి ఎడాపెడా తవ్వకాలు చేస్తున్నారని, ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి ప్రోద్భలంతో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అక్రమ తవ్వకాల విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. నేటికీ రాత్రి వేళల్లో యదేచ్ఛగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జర్నలిస్టుల స్థలాల్లో తవ్వకాల నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో అమరావతి చేపట్టి సీఎం ఇంటి ముందే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. పరిస్థితి అంతవరకు తెచ్చుకోకుండా అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాలను అరికట్టడంతో పాటు గుంతలు పడ్డ స్థలాలను చదును చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలని, జర్నలిస్టులు ఇళ్లు కట్టుకోవడానికి వీలుగా అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్థలాలను పరిశీలించిన వారిలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ ఏచూరి, జాతీయ సమితి సభ్యులు కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.వి.సుబ్బయ్య, జిల్లా గౌరవ సలహాదారులు వైపీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకన్న, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వెంకటేష్, వీడియో జర్నలిస్టుల సంఘం నాయకుడు ఎల్లగౌడ్ తదితరులు ఉన్నారు.

గొర్రెల, మేకల పెంపకందారుల సమస్యలపై ఉద్యమం

చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గొర్రెల, మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉద్యమాలకు సన్నద్ధం కావాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం కోట్ల పోతులయ్య (అనంతపురం) అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత ప్రధానంగా 4 లక్షల మంది భూమి లేని పేద రైతులు, చిన్న, మధ్య తరగతి రైతులు పశు పోషణలో గ్రామీణ పేదలకు జీవనాధారం గొర్రెల, మేకల పెంపకమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు గొర్రెల, మేకల పెంపకం దార్లను ఆదుకోవడం లేదని, సీజనల్‌గా వచ్చే వ్యాధులను అదుపు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోందన్నారు. ప్రకృతి వైపరీత్యాల పిడుగులకు గొర్రెల కాపరులు మరణిస్తున్నప్పటికి ప్రభుత్వం ఆదుకోవడం లేదని, రోడ్డు ప్రమాదంలో మరణించే జీవాలకు నష్టం చెల్లించడంలేదని తెలిపారు. దొంగల బారి నుంచి రక్షణ లేదని, రుణాల సౌకర్యం లేదని తెలిపారు. పూర్తిగా గొర్రెల కాపరులను చిన్నచూపు చూస్తూ పాలకవర్గాలు మోసగిస్తున్నాయని, అందుకే గొర్రెల, మేకల పెంపకం దార్లు తమ సమస్యల పరిష్కారానికిగాను రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకం దార్లు గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న పథకాల అమలుపై నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు గొర్రెల, మేకల పెంపకం దారులకు ఉపయోగపడటం లేదని, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని గొర్రెల, మేకల పెంపకం దార్ల నిరంతర శ్రమ వల్ల మాంసం ఉత్పత్తిలో పెరుగుదల సాధించినప్పటికీ, గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం చాలా ఘోరమైన విషయమన్నారు. అందుకే పోరాటాలను ఉధృతం చేయడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం నాయకులు కొలుసు వేణు గోపాల నాగేశ్వరరావు (కృష్ణా), చింతల కృష్ణ (ఎన్టీఆర్ జిల్లా), పొట్టేలు పెంటయ్య (ఏలూరు) మారాని నారాయణ బాబు, డి.ఎల్లమ్మ (చిత్తూరు), పి.టి.లక్ష్మీ (తిరుపతి), డి.శ్రీనివాసులు యాదవ్, కార్తీక్ (నంద్యాల జిల్లా) పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

వ్యవసాయ మంత్రికి కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పసుపు పండే జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, రైతులకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో పసుపు పంటను 43,683 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారని, పసుపు అధికంగా పండే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉందన్నారు. పసుపు మార్కెట్‌లో ఏర్పడుతున్న హెచ్చు తగ్గుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆరబెట్టిన పసుపు కొమ్ములు తడిచి రంగు మారడంతో వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర క్వింటా రూ.6,850 కాగా, ఈ ధర కూడా రైతులకు లభించడం లేదని వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.4,500 నుంచి రూ.5,500 కు మించి అధిక శాతం మంది రైతులకు దక్కడం లేదన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో పసుపు రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ ధరలతో పోల్చుకుంటే ప్రతి ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రతినిధి బృందం ఈ నెల 10న గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డును సందర్శించిందని, వివిధ జిల్లాల నుంచి పసుపు అమ్ముకునేందుకు వచ్చిన రైతులతో ప్రతినిధి బృందం చర్చించి వారి సమస్యలను తెలుసుకుందని గుర్తు చేశారు. మద్దతు ధరలు లభించడం లేదని వారు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుతమున్న మద్దతు ధర రూ.6,850 మూడేళ్లుగా కొనసాగుతోందని, ప్రతి ఏటా రైతుకు సాగు ఖర్చులు మాత్రం పెరుగుతునే ఉన్నాయన్నారు. గతంలో ఎకరా 40-45 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఇటీవలి కాలంలో 25-30 క్వింటాళ్లకు మించడంలేదని, తాము దుగ్గిరాల మార్కెట్ యార్డు సందర్శించిన రోజున కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పసుపు అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చారని వివరించారు. మార్కెట్ యార్డులో భోజన, విశ్రాంతి వసతుల్లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు భోజన, విశ్రాంతి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ స్థితిలో పెరిగిన ఉత్పత్తి ఖర్చులకనుగుణంగా మద్దతు ధరను డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం క్వింటా రూ.15 వేలకు పెంచాల్సిన అవసరం ఉందని, దిగుబడులు పెరిగే వెరైటీల విత్తనాన్ని 50 శాతం సబ్సిడీ రాయితీపై రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం

సర్పంచ్‌ల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, సర్పంచ్‌ల నిధులు, విధులు లాక్కుని ఉత్సవ విగ్రహాలుగా మార్చారని టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం టీడీపీ గ్రామ సర్పంచ్‌లతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలకు కూడా గౌరవం లేదని, చేసిన పనులకు బిల్లులు లేవని, వైసీపీ పాలన అంతమవ్వాలని వైసీపీ సర్పంచులే అంటున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఓ సర్పంచి జగన్‌ని గెలిపించి పెద్ద తప్పు చేశామని బహిరంగంగా మీడియా ముందు చెప్పుతో కొట్టుకున్నాడు. సర్పంచ్‌లు తమ హక్కుల కోసం పోరాడాలి, లేదంటే ఆ పదవికి అన్యాయం చేసినవారవుతారన్నారు. జగన్ ఒక సైకో, ఆ సైకోకు భయపడిపోతే రాష్ట్రం నాశనమవుతుంది. ఎదురు తిరిగి పోరాటం చేస్తే ప్రజలు మీకు అండగా ఉంటారు. టీడీపీ అధికారంలోకి వస్తే సర్పంచ్‌లకు పూర్వ వైభవం తీసుకొస్తాం, నిధులు, విధులు ఇచ్చి మీ హక్కులను కాపాడతామని తెలిపారు. గ్రామంలో ఉన్న సహజవనరులను కాపాడుకోవటం సర్పంచ్‌ల బాధ్యత అని, వైసీపీ నేతలు అక్రమంగా మైనింగ్, ఇసుక తవ్వకాలు జరిపితే ఎక్కడికక్కడ అడ్డుకోవాలని అన్నారు. ఇష్టానుసారం ఇసుక తవ్వితే భూగర్భ జలాలు ఎండిపోయి పర్యావరణం ప్రమాదంలో పడుతుంది. తద్వారా భవిష్యత్ తరాలు నష్టపోతాయి. టీడీపీ హయాంలో పంచాయితీరాజ్‌కి నరేగా నిధులు అనుసంధానం చేసి గ్రామాల్లో పంట కుంటలు తవ్వి భూగర్భజలాలు పెంచామని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని పనులు చేయిస్తాం, పెండింగ్ బిల్లులు, నిధులు విడుదల చేస్తామన్నారు. వైసీపీ సర్పంచులను కలుపుకుని చలో అమరావతి, చలో దిల్లీ, కలెక్టరేట్ల ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహించాలని, జగన్ రెడ్డి పంచాయితీ వ్యవస్థను దుర్వినియోగం చేసిన తీరు ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ వలంటీర్లకు వ్యతిరేకం కాదని, వలంటీర్లు ప్రజా సేవ చేస్తే స్వాగతిస్తామన్నారు. కానీ ప్రజాధనం జీతంగా తీసుకుంటూ వైసీపీకి సేవ చేయటం ఏంటి? అనుమతి లేకుండా ప్రజల ఇళ్లకు, ప్రైవేట్ ఆస్తులు స్టిక్కర్లు అంటించటం నేరం. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న వలంటీర్లు ఆ పని చేయటం ఇంకా పెద్ద నేరమని తెలిపారు. వలంటీర్లు వైసీపీ స్టిక్కర్లు అంటిస్తే వీడియోలు తీసి ఎంపీడీవో, కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని అన్నారు. చైతన్య రథం పత్రికకు సీఐడీ నోటీలిచ్చారు. అసలు సీఐడీకి ఏం సంబంధం? పాదయాత్రలో మాట్లాడొద్దంటూ లోకేశ్‌కి తాడిపత్రి డీఎస్పీ నోటీసులిస్తారా? ఎంత దుర్మార్గం. అడిగే వాళ్లు లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

PUBLIC NOTICE

Notice is hereby given that M/s. Krishnapatnam Power corporation CIN U40105TG2007PLC056531 with its Office at Plot No. 379, Road No. 10, Jubilee Hills, Hyderabad – 500 033, India, ('Owner'), is the sole and absolute owner of the 'Scheduled Properties' mentioned hereunder and is in actual physical possession thereof. Owner is proposing to mortgage the Scheduled Properties and has claimed that its rights are free from all encumbrances, charges, claims, etc. of whatsoever nature. This public notice is issued for verification of the title of the 'Owner' with respect to the 'Scheduled Properties'.

Any persons including any banks, financial institutions having any valid and legal claim, right, title, demand or interest by virtue of any sale, gift, lease, tenancy, license, exchange, partition, mortgage, charge, lien, inheritance, succession, trust, maintenance, possession, easement, agreement, lis-pendens, stay order, attachment, decree, specific performance or any other right of whatsoever nature are called upon to convey their objection in writing to **G.V.L Nagamani, BA., B.L., Advocate** at Fat **No. 305, 4th floor, Abheesta Apartment, Nethaji Nagar, 4th street, A.K Nagar Post, Nellore city, SPSR Nellore District - 524003,** within (14) fourteen days from date of this notice, along with all supporting documents, failing which it shall be presumed that there is /are no claim/s and such claim/s if any, shall be considered to be waived and abandoned and thus void in respect of the **'Scheduled Properties'.**

'SCHEDULED PROPERTIES'

Item I : All piece and parcel of land and building comprised in Survey Number's **454** an extent of 8.29 Acre with vide doc.no 5768/2011, 743/A an extent of 0.27 acre with vide doc.no 6643/2011, admeasuring Acre 8.56 Cents, situated at Thammina patnam Village, Chillakuru Mandal, Tirupati District, AP.

G.V.L Nagamani, BA., B.L., Advocate

PUBLIC NOTICE

Notice is hereby given that M/s. Krishnapatnam Infratech Limited CIN U45209TG2008PLC057033with its Office at Plot No. 379, Road No. 10, Jubilee Hills, Hyderabad – 500 033, India, ('Owner'), is the sole and absolute owner of the 'Scheduled Properties' mentioned hereunder and is in actual physical possession thereof. Owner is proposing to mortgage the Scheduled Properties and has claimed that its rights are free from all encumbrances, charges, claims, etc. of whatsoever nature. This public notice is issued for verification of the title of the 'Owner' with respect to the 'Scheduled Properties'.

Any persons including any banks, financial institutions having any valid and legal claim, right, title, demand or interest by virtue of any sale, gift, lease, tenancy, license, exchange, partition, mortgage, charge, lien, inheritance, succession, trust, maintenance, possession, easement, agreement, lis-pendens, stay order, attachment, decree, specific performance or any other right of whatsoever nature are called upon to convey their objection in writing to**G.V.L Nagamani, BA., B.L., Advocate** at Fat **No. 305, 4th floor, Abheesta Apartment,Nethaji Nagar, 4th street, A.K Nagar Post, Nellore city, SPSR Nellore District - 524003**, within (14) fourteen days from date of this notice, along with all supporting documents, failing which it shall be presumed that there is /are no claim/s and such claim/s if any, shall be considered to be waived and abandoned and thus void in respect of the **'Scheduled Properties'.**

'SCHEDULED PROPERTIES'

Item I : All piece and parcel of land and building comprised in Survey Number's 79/B an extent of 2.56 Acre with vide doc.no 103/2016, 579/2 an extent of 1.98 acre, 580/2 an extent of 3.01 acre, 580/3 an extent of 0.99 acre, 642/2 an extent of 2.83 acre with vide doc.no 3552/2015, 579/1A an extent of 0.66 acre, 579/1B an extent of 0.66 acre with vide doc.no 3482/2015, admeasuring Acre 12.69 Cents, situated at Thamminapatnam Village, Chillakuru Mandal, Tirupati District, AP.

Item II: All piece and parcel of land and building comprised in Survey Number's 818B an extent of 8.61 Acre, 819-1 an extent of 2.17 Acre, 826-1 an extent of 8 Acre with vide doc.no 1928/2010, 806 an extent of 4.00 Acre with vide doc.no 233/2014, 806 an extent of 2.00 Acre with vide doc.no 321/2015, admeasuring Acre 24.78 Cents, situated at Kothapatnam Village, Kota Mandal, Tirupati District, AP.

Item III: All piece and parcel of land and building comprised in Survey Number's 1608 an extent of 1.470 Acre with vide doc.no 1608/2012, 1609 an extent of 1.440 Acre with vide doc.no 760/2017, 722/A an extent of 0.490 Acre, 724 an extent of 1.980 Acre, 725/B an extent of 0.620 Acre, 726/B an extent of 0.740 Acre, 720/B an extent of 1.580 Acre with vide doc.no 781/2017, 720/A an extent of 1.20, 725/A an extent of 0.690, 726/A an extent of 0.790, 726/C an extent of 0.120 Acre with vide doc.no 782/2017, 722/C an extent of 1.580 Acre with vide doc.no 780/2017, 713 an extent of 0.850 Acre, 715 an extent of 0.880 Acre, 718-1 an extent of 1.500 Acre with vide doc.no 759/2017, 722/B an extent of 1.030 Acre, 718/1 an extent of 1.500 Acre, 723 an extent of 1.550 Acre with vide doc.no 780/2017, 731-2 an extent of 3.110 Acre with vide doc.no 898/2017, 718 an extent of 1.950 Acre with vide doc.no 1044/2017 admeasuring Acre 24.07 Cents, situated at Epuru – 1A Village, Muthukur Mandal, Sri Potti Sriramulu Nellore District, AP.

Item IV : All piece and parcel of land and building comprised in Survey Number's 181/1 an extent of 1.10 Acre with vide doc.no 1627/2015 and 181/1 an extent of 1.00 Acre with vide doc.no 70/2016 admeasuring Acre 2.10 Cents, situated at Muthukur Village, Muthukur Mandal, Sri Potti Sriramulu Nellore District, AP.

G.V.L Nagamani, BA., B.L., Advocate

సంపాదకీయం

మరింత తగ్గనున్న వృద్ధిరేటు

మన ఆర్థికవ్యవస్థ వేగంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నప్పటికీ వృద్ధిరేటు ఆర్‌బీఐ వెల్లడించిన దానికంటే మరింత తగ్గనున్నది. ఈ ఆర్థిక సంవత్సరమేగాక రానున్న సంవత్సరాలలోనూ వృద్ధిరేటు తగ్గుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎమ్‌ఎఫ్) తాజాగా అంచనాను ప్రకటించింది. మరోవైపు అన్నిరకాల నిత్యావసర వస్తువులు, శిలాజ ఇంధనాల ధరల పెరుగుదలను స్థిరీకరించడంపై కూడా ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు చర్చలు జరుపుతోంది. ఈ సంస్థల అధ్వర్యంలో జరుగుతున్న చర్చల్లో అనేక దేశాలు పాల్గొన్నాయి. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం నియంత్రణ అంశాలు ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. దాదాపు మూడేళ్లపాటు కొవిడ్-19 మహమ్మారి సృష్టించిన అల్లకల్లోలం మూలంగా ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలు తల్లకిందులయ్యాయి. భారతదేశంలోనూ ఆర్థికరంగం కుదేలైపోయింది. అలాగే ఉక్రెయిన్-రష్యాల మధ్య ఏడాదికిపైగా జరుగుతున్న యుద్ధం వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణాలు. ఈ ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు గతంలో 6.1శాతం ఉండవచ్చునని అంచనా వేసినప్పటికీ తాజా అంచనా 5.9శాతం ఉంటుందని ఐఎమ్‌ఎఫ్ ప్రకటించింది. వార్షిక ఆర్థిక దృక్పథం నివేదికలో 2024-25 ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు కూడా 6.3శాతమే ఉంటుందని వార్షిక నివేదిక పేర్కొంది. గతంలో 6.8శాతం ఉండవచ్చునని అంచనా వేశారు. 2022-23ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.8శాతం ఉన్నప్పటికీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 5.9శాతం మాత్రమే ఉండవచ్చునని కూడా ఈ సంవత్సరం జనవరిలోనే ఐఎంఎఫ్ ప్రకటించింది. రిజర్వుబ్యాంకు 2022-23లో 7శాతం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.4శాతం ఉండవచ్చునని అంచనావేసింది. అయితే ప్రభుత్వ అంచనాలు, ప్రకటనలు వేరుగానూ, గొప్పలు చెప్పుకోవడం లాంటివి కనిపిస్తాయి. ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ప్రకటించలేదు. ప్రభుత్వం ప్రకటించే గణాంకాలపై గతంలో ఆర్థికనిపుణులు సందేహాలు వెలిబుచ్చారు. 2022లో 6.8శాతంగా ఉన్న వృద్ధిరేటు గణనీయంగా తగ్గుతుందని అది 5.9శాతానికి పరిమితం కావచ్చునని ఐఎంఎఫ్ తెలిపింది. కరోనా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలన్నింటిలోనూ వృద్ధిరేటు తక్కువగానే నమోదైంది. చైనా వృద్ధిరేటు కూడా 2023లో 5.2శాతం, 2024లో 4.5శాతం ఉండవచ్చునని ఐఎంఎఫ్ అంచనా వేసింది. కరోనా మహమ్మారి, యుద్ధం కారణంగా కుదేలైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా కోలుకుంటున్నది. అయితే ఇదే సమయంలో మళ్లీ ఒమిక్రాన్ మహమ్మారి కొత్తరకం తలెత్తడం, యుద్ధం ఇంకా ఆగకపోవడం, ముడిచమురు ఉత్పత్తి తగ్గించాలని ఒపెక్, ఇతర చమురు ఉత్పత్తి దేశాలు నిర్ణయించడం వృద్ధిరేటుపై ప్రతికూల ప్రభావం ఉండే అవకాశం ఉంటుంది.

మన దేశంలో కరోనా మహమ్మారి తలెత్తిన మొదటి దశ ప్రారంభంలోనే ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో అన్ని రంగాలు ఎక్కడివక్కడ స్తంభించిపోయాయి. ఉత్పత్తి, పారిశ్రామిక, నిర్మాణ రంగాలు నిలిచిపోయాయి. చిన్నపరిశ్రమలు, వ్యాపారసంస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కోట్లాదిమంది ఉద్యోగులు, కార్మికులు పనులు కోల్పోయారు. నిరుద్యోగం అపారంగా పెరిగిపోయింది. వలస కార్మికులు సహా అన్ని పరిశ్రమలు, ఉత్పత్తిరంగంలో పనిచేసేవారు ఇండ్లకే పరిమితమైపోయారు. ఆదాయాలు పడిపోయాయి. అనేక కష్టనష్టాలకుగురై వందలు, వేల మైళ్లు నడిచి సొంత గ్రామాలకు చేరుకున్న లక్షలాదిమందికి వ్యవసాయరంగమే కొంతవరకు సహాయపడింది. ప్రభుత్వం వీరికి ఏ మాత్రం సహాయపడకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు నేటికీ పూర్తిగా కోలుకోలేదు. వీరి ఆదాయాలు పెరగక కొనుగోలుశక్తి పడిపోయింది. ఉత్పత్తి రంగం దెబ్బతిని ఎగుమతులు ఆగిపోయాయి. ఈ పరిస్థితులన్నీ వృద్ధిరేటు తగ్గడానికి కారణమయ్యాయి. ఇప్పుడిప్పుడే అన్నిరంగాలు పుంజుకుంటున్నప్పటికీ ఉత్పత్తులు పెరగడంలేదు. ఫలితంగా ఎగుమతులు గణనీయంగా తగ్గిపోయి దిగుమతులు పెరిగాయి. మేక్‌ఇన్ ఇండియా నినాదానికి మత్రమే పరిమితమైంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం పరిస్థితులు ఏర్పడటం వల్ల పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమలను విస్తరించిఉత్పత్తి పెంచడం కోసం బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవడం గణనీయంగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతోంది. సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు లేదా ఉన్నవాటిని విస్తరించుకోవడానికి బ్యాంకులు అప్పులు విరివిగా వెనుకాడుతున్న గత పదేళ్లకాలంలో బ్యాంకుల నుంచి వేల, లక్షల కోట్లు రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించకుండా అనేకమంది విదేశాలకు పారిపోయారు. దాదాపు 15లక్షల కోట్లు పదేళ్ల కాలంలో ప్రభుత్వం ఈ రుణాలు రద్దుచేశాయి. తాజాగా అదానీ గ్రూపు కంపెనీల కుంభకోణం బ్యాంకులను, ఆర్థికసంస్థలను తీవ్రంగా నష్ట పరిచింది. ఈ పరిణామాలు విదేశీ పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలు దేశంలోకి రావడం తగ్గింది. ఇవి కూడా ఉత్పత్తి రంగం ఇంకా మాంద్యంలో ఉండేందుకు, వృద్ధిరేటు తగ్గేందుకు కారణమవుతున్నాయి. ప్రభుత్వ అపసవ్య విధానాలు, అసమర్థ పాలన ఈ రుగ్మతలకు ప్రధాన కారణాలవుతున్నాయని అనేకమంది ఆర్థికవేత్తలు, రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్లు విమర్శిస్తున్నారు. ఇక ఆర్థికవ్యవస్థ అభివృద్ధి వేగిరమవుతోందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉండబోదని ఇంతవరకు కలిగిన అనుభవాలు చెప్తున్నాయి. పేదరికం 20శాతానికిపైగా ఉందని అనేక దేశ, విదేశీ సర్వేలు చెప్తున్నాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం పేదరికమా.. అదెక్కడుందని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తోంది. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారుల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఈ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పెద్దగా లేవు. వృద్ధిరేటు, ఆర్థికవ్యవస్థ పెరిగినప్పటికీ దేశంలో ఆర్థిక అసమానతలు మిక్కుటమవుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం పోటీపడి పెరగడం పాలనా అసమర్థతకు సూచికలు కావా!

ప్రైవేటీకరణ దిశగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు

ఇటీవలి 38వ స్టాండింగ్ కమిటీ రిపోర్ట్ ఆఫ్ డిఫెన్స్ (2022-2023) ప్రకారం ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల కార్పొరేటీకరణ అసలు లక్ష్యం వాటిని ప్రైవేటీకరించడమే అని స్పష్టమైంది. ఆ లక్ష్యం దిశగా తొలి అడుగుగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకు ఆర్డర్లు కరువయ్యాయి. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించేందుకే టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించడం లేదు. కొన్ని సంవత్సరాలలో ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేషన్లలో చాలా వరకు అనారోగ్య సంస్థలుగా మారతాయి. ఈ కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం ఉపయోగించుకుని వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తుంది. పూర్వపు ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ బోర్డు కొత్తగా సృష్టించిన డిఫెన్స్ అండర్ టేకింగ్ యూనిట్‌లుగా పునర్నిర్మించడం అనేది ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలను ఉత్పాదక, లాభదాయక ఆస్తులుగా మార్చడం, పోటీతత్వాన్ని పెంపొందించడంతోపాటు సామర్థ్యాన్ని మెరుగు పరచడం లక్ష్యంగా పెట్టుకుంది. మరింత క్రియాత్మక, ఆర్థిక స్వయంప్రతిపత్తితో, ఈ కొత్త డిఫెన్స్ పబ్లిక్‌సెక్టార్ అండర్ టేకింగ్ యూనిట్స్ దేశంలో, విదేశాలలో నూతన మార్కెట్లను అన్వేషిస్తాయి. ఇది కేవలం కార్పొరేటీకరణకు మద్దతు కోరడానికి మాత్రమే ఉద్దేశించింది. కార్పొరేటీకరణ జరిగిన ఏడు కార్పొరేషన్ లను కలిపి 2023-24 సంవత్సరానికి 16,694.58 కోట్ల ఆర్డర్లు మాత్రమే వచ్చాయి. మ్యూనిటేషన్ ఇండియా లిమిటెడ్, ఆర్మర్డ్ వెహికల్స్ నిగంలిమిటెడ్ కార్పొరేషన్‌లకు మాత్రమే ఆర్డర్లు సౌకర్యంగా ఉంది. అయితే 8 ఫ్యాక్టరీలతో ఆర్మర్డ్ వెహికల్స్ నిగం లిమిటెడ్ కేవలం రూ.1915 కోట్లు. 4 ఫ్యాక్టరీలు ఉన్న ట్రూఫ్ కంఫర్ట్ లిమిటెడ్ కేవలం రూ.88.89 కోట్లు, 8 ఫ్యాక్టరీలతో యంత్ర ఇండియా లిమిటెడ్ రూ.700 కోట్ల ఆర్డర్‌లను కలిగి ఉన్నందున ట్రూఫ్ కంఫర్ట్ లిమిటెడ్, యంత్ర ఇండియా లిమిటెడ్ అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలకు నేరుగా ఇండెంట్‌లు ఇవ్వడం ఆపి, ఓపెన్ టెండర్ ద్వారా ప్రైవేట్‌కు వెళ్లడంతో మొత్తం 7 కార్పొరేషన్ల భవితవ్యం తలకిందులైంది. ఇటీవల ఆర్మీ కొత్తగా రూపొందించిన 12 లక్షల ఆర్మీ యూనిఫామ్‌ల సేకరణకుగాను బహిరంగ టెండర్‌ను ప్రారంభించింది. ఆంక్షలు విధించడం ద్వారా ట్రూఫ్ కంఫర్ట్ లిమిటెడ్ కింద ఉన్న 4 ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు టెండర్‌లో పాల్గొనడానికి కూడా అనుమతించలేదు. గ్లైడర్స్ ఇండియా లిమిటెడ్ కార్పొరేషన్ కింద ఉన్న పారాచూట్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీని విస్మరించి, ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుండి 350 కంబాట్ ఫ్రీ ఫాల్ పారాచూట్ సిస్టమ్ కొనుగోలు చేయాలని సైన్యం నిర్ణయించింది. కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నదని గ్రహించిన ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, వారి సంఘాలు కార్పొరేటీకరణను ప్రతిపాదించిన రోజు నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఇటీవల, ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ డిఫెన్స్ రికగ్నైజ్డ్ అసోసియేషన్స్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్‌కు వివరణాత్మక నోట్‌ను సమర్పించాయి. ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేటీకరించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ బోర్డు పరిధిలోని డిపార్ట్‌మెంటల్ సంస్థలుగా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీల హోదాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. ఉద్యోగ సంఘాలు ఇచ్చిన విలువైన సూచనలను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతున్నారు. 30,000 కోట్ల విలువైన రక్షణరంగ సంస్థల ప్రైవేటీకరణ బడా గుత్తాధిపత్యాల నేతృత్వంలోని పాలక పెట్టుబడిదారీవర్గ కుట్రలో భాగం.

ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల చేతిలో కీలుబొమ్మలుగా వారి ఎజెండాను అమలు పరుస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేవారు కార్పొరేట్‌శక్తులే కావడంతో వారు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత వారిఎజెండాను అమలు పరుస్తున్నారు. ప్రతి ప్రభుత్వ రంగసంస్థలు ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించే బాధ్యత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలదే. దేశ భద్రతకు సంబంధించిన రక్షణరంగంలో ప్రైవేట్‌వ్యక్తుల ప్రమేయం ఉండరాదు.

ఆళవందార్ వేణుమాధవ్, 8686051752

కుమ్ములాటల్లో బీజేపీ-కాంగ్రెస్‌లో ఉత్సాహం!

ఎం. కోటేశ్వరరావు

అధికార బీజేపీ-ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు దేశమంతటా ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు వెలువడిన వార్తలను చూస్తే కాంగ్రెస్ శిబిరంలో ఉత్సాహం, బీజేపీ దొడ్లో కుమ్ములాటలు కనిపిస్తున్నాయి. బీజేపీ నేతలంతా ఢిల్లీలో జాబితా గురించి మల్లగుల్లాలు పడుతున్నారు. ముందు ఆదివారం అని ఆ తర్వాత సోమవారం లేదా మంగళం వారం గానీ జాబితా వెలువడవచ్చని సీఎం బొమ్మై చెప్పారు. కాంగ్రెస్ ఇప్పటికే 142 మందితో జాబితాను ప్రకటించింది. బీజేపీ జాబితాను బట్టి మిగతా సీట్లకు ప్రకటిస్తారని వార్తలు. క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పుకుంటున్న బీజేపీ ఇంతవరకు జాబితాను తేల్చుకోలేకపోవటం బలహీనత, కుమ్ముటాటలకు చిహ్నం.

మొత్తం 224 స్థానాలున్న అసెంబ్లీకి మే పదవ తేదీన ఎన్నికలు, పదమూడవ తేదీన ఫలితాలు వెలువడతాయి. ఈ నెల పదమూడున నోటిఫికేషన్, 20వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 21న పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు 24వ తేదీని గడువుగా నిర్ణయించారు. ప్రస్తుతం సభలో బీజేపీకి 117, కాంగ్రెస్‌కు 75, జెడిఎస్‌కు 27 స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు మే 24వ తేదీ వరకు ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 38.14శాతం ఓట్లు 80 సీట్లు, బీజేపీకి 36.85 శాతం ఓట్లు 104 సీట్లు, జెడిఎస్‌కు 18.35 శాతం ఓట్లు 37 సీట్లు వచ్చాయి. జెడిఎస్ నేత కుమార స్వామి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఏడాది గడచిన తరువాత 2019 జూలైలో కాంగ్రెస్, జెడిఎస్‌ల నుంచి కొంత మందిని ఆకర్షించి వారితో రాజీనామాలు ఇప్పించిన బీజేపీ సభలో తమకే మెజారిటీ ఉందంటూ ఆ ప్రభుత్వాన్ని కూలదోసి బిఎస్ ఎడియూరప్పను సిఎంగా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఉప ఎన్నికల్లో గెలిచిన సీట్లతో పూర్తి మెజారిటీ సాధించింది. తరువాత బీజేపీలో కుమ్ములాటల కారణంగా 2021 జూలై 26న ఎడియూరప్పతో రాజీనామా చేయించి కొత్త సిఎంగా బసవరాజ్ బొమ్మైని గద్దె నెక్కించారు.

ఎన్నికల ప్రకటన వెలువడిన రోజునే బీజేపీ ఓడిపోనుందని సర్వే సంస్థలు పేర్కొన్నాయి. కర్ణాటకలో1985 తరువాత ఇప్పటి వరకు ఒకసారి నెగ్గిన పార్టీ మరొకసారి వెంటనే అధికారానికి రాలేదు. ఈ సారి ఆచరిత్రను తిరగరాసి తమ పట్టును శాశ్వతం చేసుకోవాలని బీజేపీ చూస్తున్నది. తిరిగి అధికారానికి రావటం ద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల ముందు దేశమంతటా ఊపు తేవాలని కాంగ్రెస్ భావిస్తున్నది.దక్షిణాదిన హిందూత్వ ప్రయోగశాలగా పరిగణిస్తున్న కర్ణాటకలో మత ప్రాతిపాదికన ఓటర్లను చీల్చి లబ్ది పొందాలని బీజేపీ, సంఘపరివారం అనేక వివాదాలను ముందుకు తెచ్చి చిచ్చుపెట్టింది. చిత్రం ఏమిటంటే అధికారం వస్తుందని భావిస్తున్న కాంగ్రెస్‌లో ఆశావహులు ఎక్కువగా ఉండి అసంతృప్తి తలెత్తటం సహజం కానీ ఓడిపోతుందని భావిస్తున్న బీజేపీలో కుమ్ములాటలు అంతకంటే ఎక్కువగా ఉండటం విశేషం. ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్ధులను ప్రకటించలేదు. కాంగ్రెస్, జెడిఎస్ ఎంతో ముందుగానే ఎక్కువ సీట్లకు అభ్యర్ధులను ప్రకటించాయి. సిద్ధాంతాలు తప్ప తమకు అధికారం ముఖ్యం కాదని, ఇతర పార్టీలతో పోలిస్తే తమది ఎంతో భిన్నమైనది, క్రమశిక్షణ కలిగిన పార్టీ అని చెప్పుకొనే బీజేపీలో ఇలాంటి ధోరణులు వెల్లడికావటం ఇదే ప్రధమం కాదు. కర్ణాటకతో సహా అనేక రాష్ట్రాలలో అధికారం కోసం ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరుతెన్నులను చూస్తున్న తరువాత తమకు దక్కని అధికారం ఇతరులకూ దక్కనివ్వం అనే ధోరణి పెరిగిపోయింది.

2019 ఫిరాయింపుల్లో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి రమేష్ జర్కిహోలీ తాను కోరిన మూడు సీట్లను తన అనుచరులకు ఇవ్వకుంటే తాను పోటీలో ఉండనని బెదిరించారు. వారసత్వ రాజకీయాలంటూ ఇతర పార్టీల మీద ధ్వజమెత్తిన బీజేపీ ఇప్పుడు కర్ణాటకలో అదే సమస్యతో సతమతం అవుతోంది. కన్నడిగుల ఓట్ల కోసం బీజేపీ మతాన్ని జోడించి ఎంతో ముందుగానే సమీకరణకు పూనుకుంది. ముఠా కుమ్ములాటలకు తోడు నలభైశాతం కమిషన్ ప్రభుత్వం అనే పేరు తెచ్చుకుంది. గతంలో సామాజిక సమీకరణలను రెచ్చగొట్టి లబ్దిపొందిన బీజేపీకి ఇప్పుడు అవే గుదిబండలుగా మారుతున్నట్లు చెబుతున్నారు. మరోవైపు ఎడియూరప్ప-బిఎల్ సంతోష్ వర్గాలుగా బీజేపీ మారింది.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడిగా ఉన్న బిఎల్ సంతోష్ వర్గనేతలు విద్వేష ప్రచారానికి పెట్టింది పేరని అనేక ఉదంతాల్లో వెల్లడైంది. రాష్ట్ర అధ్యక్షుడు నళిని కుమార్ కటీల్, రాష్ట్ర మంత్రి సిటి.రవి, కేంద్ర మంత్రి అనంత కుమార్ హెగ్డే వంటి వారు హిందూత్వ రాజకీయాలకు కేంద్రంగా ఉండగా ఎడియూరప్ప వర్గం కులసమీకరణల మీద కేంద్రీకరిస్తుంది. హిజాబ్, టిప్పుసుల్తాన్ వివాదాన్ని ముందుకు తెచ్చిన హిందూత్వశక్తుల అజెండాను అమలు జరిపి వారిని సంతుష్టీకరించినట్లు విమర్శలున్నాయి. ముస్లిం వ్యతిరేకతలో భాగంగా ఇప్పటి వరకు వారికి ఉన్న నాలుగుశాతం రిజర్వేషన్లను రద్దు చేశారు. వక్కళిగ-లింగాయత్ కులాలకు రిజర్వేషన్లను సమం చేసి వారిని సంతుష్టీకరించేందుకు చూశారు. బీజేపీ కుమ్ములాటలతో ఉండగా అధికారం కళ్ల ముందు కనిపిస్తుండటంతో కాంగ్రెస్‌లోని ప్రధాన వర్గాలు తాత్కాలికంగా సర్దుబాటు చేసుకున్నట్లు వార్తలు. వక్కళిగ సామాజిక తరగతి మద్దతు ప్రధానంగా ఉన్న జెడిఎస్ కూడా పోటీ చేస్తున్నది. అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ మద్దతుతో ఆ పార్టీ నేత కుమారస్వామి సిఎంగా పని చేశారు. త్రిముఖ పోటీగా కనిపిస్తున్నప్పటికీ మూడు పార్టీలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బలంగా ఉండటంతో ఆచరణలో రెండు ప్రధాన పక్షాల సమీకరణే ఎక్కువగా ఉంటున్నది.

క్రైస్తవుల మీద విద్వేష పూరిత ప్రసంగం చేసి రెచ్చగొట్టినందుకు రాష్ట్ర మంత్రి మునిరత్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్చినెల 31న ఒక టీవీ ఛానల్లో మాట్లాడుతూ మురికి వాడల్లో ఉన్న వారిని మతమార్పిడి చేస్తున్న క్రైస్తవులను తన్ని తరిమికొట్టాలని పిలుపుఇచ్చినట్లు ఎన్నికల సంఘం బృందఅధికారి మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. మునిరత్న బెంగలూరులోని రాజరాజేశ్వరి నగర్‌నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కన్నడిగులు-తమిళుల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నట్లు అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న హనుమంతరాయప్ప కూడా మునిరత్న మీద కేసుదాఖలు చేశారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అడుగుపెడితే తన్ని పంపండి, నేను చూసుకుంటాను అన్న మంత్రి వీడియోను కూడా పోలీసులకు అందచేశారు. ఇతగాడు సినిమా నిర్మాత కూడా." ఉరి గౌడ నంజె గౌడ " అనే పేరుతో ఒక సినిమా పేరు నమోదు చేశారు. వక్కళిగ సామాజిక తరగతికి చెందిన ఆ పేర్లు గల వారు పద్దెనిమిదవ శతాబ్దిలో మైసూరు రాజు టిప్పు సుల్తాన్ను హత్య చేశారన్నది ఒక కథ. దాన్ని చరిత్రకారులు కొట్టిపారవేశారు. తరువాత అంతటితో నిలిపివేశారు.

మైదానం

కుక్క-గాడిద-ఓ తెలుగు అబ్బాయి

చింతపట్ల సుదర్శన్

ఈ భూమ్మీద మనుషులంత తెలివైనవారు మరిలేరు. అందువల్లే కదా నాలుగుకాళ్లను రెండుకి తగ్గించుకున్నారు. ఊగులాడే తోకను పీకేసుకున్నారు. మేం మాత్రం నాలుగు కాళ్లమీదే నడుస్తున్నాం. తోక ఊపుకుంటూ తిరుగుతున్నాం. ఈ తరం మనుషులకు మేం తెలియక పోయినా పుస్తకాల్లో మా బొమ్మలు చూసి ఉండవచ్చు. ఇళ్లల్లో తండ్రులు కొడుకుల్ని గాడిదలనీ, గాడిద కొడుకులనీ తిట్టినప్పుడు మా జాతి గుర్తుకురావచ్చు. గాడిదల్లో మనుషులు ఉండకపోవచ్చుకానీ మనుషుల్లో గాడిదలు ఉన్నారంటే కాదనేవారున్నారా?

అవును నేను గాడిదనే. ఒకప్పుడు మూటలు మోసిన వాణ్ణే. ఇప్పుడు ఎవరికీ పనికిరాకపోవడంతో ఒంటరి తిరుగుళ్లు తిరుగుతున్నా. గాడిదనైనంత మాత్రాన తెలివిలేని వాణ్ణేంకాదు. వెనుకట 'కిషన్‌చందర్' అనే రచయిత రాసిన 'గాడిద ఆత్మకథ' లోని గాడిద నా ముత్తాత. ఆ గాడిద ఎంత తెలివైందో చెప్పక్కర్లేదు. అప్పటి ప్రధానమంత్రి నెహ్రూను కల్సి మాట్లాడిందట. జీన్స్ వల్ల నాకూ ఆ తెలివి వచ్చినట్లుంది. మనుషులు రోజూ దినపత్రిక చదివి పారేస్తారేమో నేను మాత్రం నమిలి మింగేస్తాను. అక్షరమక్షరం నా పొట్టలో స్టోర్ అవుతుంది. అందువల్ల మనుషులకు సంబంధించి నాకు తెలియని విషయాలంటూ లేవు.

ఎవరైనా నా ఎదురుగ్గా వచ్చి నిలబడితే పేపర్ వెయిట్‌ల వంటి కళ్లతో చూస్తూ పలుగు రాళ్లవంటి పళ్లు ఇకిలిస్తాను. కానీ నా వెనక్కు వచ్చి నిలబడితే మాత్రం కాలుఎత్తి ఫెడీఫెడీ తంతాను. మనుషుల్లో కూడా పైకి నవ్వుతూ వెనుకనించి పొడిచేవాళ్లు, తన్నేవాళ్లు, గోతులు తీసేవాళు లేరా? ఇక్కడేదో పేపరు కనపడుతున్నది. కరోనా కాలంలో పేపర్లే కనపడేవికాదు. ఇప్పుడు ఫరవాలేదు. దీన్ని నమిలితేనా బాన పొట్టకాస్త శాంతించవచ్చు.

గాడిద పేపరు నవుల్తుంటే మాంసం కొట్టు ముందు, తోకమీద కాళ్లు పెట్టుకుకూచున్న కుక్క నోరు తెరిచింది. అప్పట్నించీ వెయిటింగిక్కడ. ఓ ఎముకో, చిన్న మాంసం ముక్కో షాపులోంచి ఎగిరి బైటపడదా అని. ఎన్నికైన ప్రజాప్రతినిధులంతా పదవులకోసం ఇలాగే చొంగ కారుస్తారట గదా. మా గాడిద 'బ్రో' చెప్పాడు. ఎక్కచూసినా కాంపిటీషనే. తీరా తిండానికి ఏదైనా వచ్చిపడిందే అనుకోండి. ఎక్కడ్నించో నా జాతివాళ్లు పదిమంది తోకలు ఊపుకుంటూ వచ్చేస్తారు. అప్పుడు జరుగుతుంది దొమ్మీ. జాతి వైరం మీ దగ్గరే నేర్చుకున్నాం. మాదంతా తిండికోసం పోరాటమేకాని తిండి ఎక్కువైకాదు. మేము ఇళ్లల్లో పరుపుల మీద నిద్రపోయే జాతి కుక్కలం కాదు. మమ్మల్ని 'టామీ' అని 'కూగర్' అనీ పిలిచేవాళ్లు లేరు. 'స్లమ్ డాగ్స్' అనీ ఊరకుక్కలనీ అంటారు. ఓ ముద్దపెట్టిన వాళ్ల చుట్టూ తోక ఊపుతూ తిరుగుతాం. మనుషులకు లేనిదీ మాకు ఉన్నదీ విశ్వాసమేకదా!

జాతి కుక్కను కాకపోతేనేం ఎంతో కొంతలోకం పోకడ తెలిసిన కుక్కనే. కరవడం రాకపోయినా ఆత్మరక్షణకు అరవడం నేర్చుకున్నాను. మనుషులకు మైకు అవసరం కానీ నా కక్కర్లేదు. నాదీ, బ్రదర్ గాడిదదీ డోల్బీ డిజిటల్ సౌండే.

బ్రదర్ గురించి చెప్పలేదు కదూ. ఈ నాటి ఈ బంధం ఏనాటిదో కాదు రెండేళ్ల కిందటిదే. రకరకాల పార్టీలవాళ్లు లౌడ్‌స్పీకర్లలో 'తాడ్‌గా' మాటల సంతర్పణచేసే మైదానం చివరున్న ఓ పాడుబడిన ఇంట్లో నివాసం ఉంటున్నాం. మాకు డబుల్ బెడ్రూమ్‌లు ఎవరిస్తారు? ఆ ఇల్లు ఏదో లిటిగేషన్‌లో ఉందని ఈ దేశంలో సివిల్ కేసుల ఆయుర్దాయం చాలా పొడుగాటిదని, ఓ నాటికి తెగి చావవని మనం పర్మనెంటుగా ఇక్కడేఉండి పోవచ్చని డాంకీ బ్రదర్ చెప్పాడు. బ్రదర్ చాలా తెలివైన వాడు. ఎన్ని పుస్తకాలు నమిలేడో, ఎన్ని మాగజైన్లు కొరికేడో ఎన్ని కరపత్రాలు మింగోడోకానీ 'ఐఏఎస్' పరీక్ష పాసవగల నాలెడ్జి సంపాదించాడు. అన్న దగ్గరే నేను ఎన్నో విషయాలు తెల్సుకున్నాను.

ఎముకేదో షాపులోంచి ఎగిరిముఖానపడ్డంతో అందుకుని పాడుబడ్డ ఇంటివైపు పరుగెత్తింది. తెల్లమచ్చల నల్లకుక్క 'ఏంటి డాగీ ఇవాళ తొందరగానే వచ్చేశావు?' అని అడిగింది గాడిద అరుగెక్కుతున్న కుక్కతో.

అదృష్టం కలిసొచ్చి 'లా అండ్ ఆర్డర్' ప్రాబ్లమ్ రాకముందే దౌడుతీశాను? అంది కుక్క ఎముకను ముందు కాళ్ల మధ్యపట్టుకు కూచుని. 'మన మానవ మిత్రుడు ఇటువైపు రావడం లేదేం ఈ మధ్య' అంది గాడిద పళ్లల్లో ఇరుక్కున్న పేపరు ముక్కని నాలుకతో కెలుకుతూ. 'అదిగో వస్తున్నాడు' అంది కుక్క ఎదురుగ్గా వస్తున్న మనిషినిచూపుతూ.

అరుగుపైకి ఎక్కినవాడు ఐదడుగుల తొమ్మిది అంగుళాల ఎత్తుకి తక్కువలేడు. మూడుపదుల వయస్సుకి ఎక్కువాలేదు. మూడుపదుల వయస్సుకి ఎక్కువాలేదు. మాల్‌న్యూట్రిషన్ కారణంగానో నిరంతరంగా 'లివర్‌తో ఫైటింగ్' కారణంగానో ఎముకల మీద మాంసం దట్టంగా పెరగలేదు. అరుగుమీద ఉన్న బండరాయిమీద కూచుంటూ జేబులో సీసా బైటకుతీశాడు అబ్బాయి. 'ఏంటి మళ్లీ ఏదైనా ప్రాబ్లమా?" అనడిగింది గాడిద. 'ఉద్యోగాలు వచ్చేస్తున్నాయటగడా తాగుడు మానేస్తే పోలా?' అంది కుక్క. ఎక్కడి ఉద్యోగాలు? పేపరులీకు చేశారని పరీక్షలు నిరవధికంగా వాయిదా పడ్డవి.' సీసా మూత తీసి గుక్కెడు నోట్లో పోసుకుంటూ అన్నాడు అబ్బాయి. మనసు బాగాలేప్పుడు మనసు బాగా హుషారుగా ఉన్నప్పుడు ఈ అరుగుమీదకి వచ్చి మందుకొట్టే అబ్బాయికి కుక్క గాడిదలతో బాగా స్నేహం కుదిరింది. వాటి భాష తెలుగు కావడంతో తాను తెలుగు అబ్బాయి కనక బాగా కనెక్టు అయిపోయాడు. ముగ్గురూ కల్సి పాలిటిక్స్, కరెంటు ఎఫైర్స్ మాట్లాడుకోవడం, కథలు చెప్పుకోవడం చేస్తుంటారు.

'ఈ రోజు విశేషాలేమిటో' అన్నాడు తెలుగు అబ్బాయి మిరపకాయ బజ్జీ నములుతూ. 'రాజకీయ నాయకుల రాజకీయాలు ఉన్నంతకాలం, ఎందుకేస్తున్నామో, ఎవరి కేస్తున్నామో తెలియకుండా ఓట్లు వేసే మనుషులు ఉన్నంతకాలం విశేషాల కేమిలోటు. రాబోతున్నది ఎన్నికల కాలం మనకు కావలసిన 'కాలక్షేపం' అన్నది గాడిద. 'అవునవును అన్నా! పెద్దన్నా! మనిషిని మనిషి అర్థం చేసుకోలేకపోతున్న సమూనాలో నువ్వు మమ్మల్ని అర్థం చేసుకున్నావు. మాతో గడపడానికి వస్తున్నావు. వీలైనప్పుడు నువ్వు తెచ్చిన చికెన్ ముక్కోటి నాకు, పాత పేపర్ ఒకటి గాడిద బ్రో కు ఇస్తున్నారు. అప్పుడో ఇప్పుడో కాకుండా వారానికి ఒక్కసారన్నా వస్తే అన్న మన ఆలోచన్లు షేర్ చేసుకుందాం(అన్నది కుక్క).

అవునవును అన్నా! పెద్దన్నా! మనిషిని మనిషి అర్థం చేసుకోలేకపోతున్న జమానాలో నువ్వు మమ్మల్ని అర్థం చేసుకున్నావు. మాతో గడపడానికి వస్తున్నావు. వీలైనప్పుడు నువ్వు తెచ్చిన చికెన్ ముక్కోటి నాకు, పాత పేపర్ ఒకటి గాడిద బ్రోకు ఇస్తున్నావు. అప్పుడో ఇప్పుడో కాకుండా వారానికి ఒక్కసారన్నా వస్తే అన్నా మన ఆలోచనలు షేర్ చేసుకుందాం' అన్నది కుక్క.

తప్పకుండా! బజ్జీచేత్తో పట్టుకుని కాగితం గాడిద మీదకు విసిరేస్తూ అన్నాడబ్బాయి 'తాగేవాడికి తాగినంత. భగీరధుడనేవాడు ఆకాశగంగను భూమ్మీదకు తెచ్చినట్టు సందుసందుకీ సారా పారిస్తున్నారు ఏలిన వారు. చుక్క చిక్కినప్పుడల్లా ఇక్కడికేవస్తా' అంటూ తెలుగు అబ్బాయి 'జగమే మాయ, బ్రతుకేమాయం' పాట అందుకున్నాడు. 'ఏ బ్రాండు తాగినా ఈ పాటే పాడాలా?' అంది గాడిద. 'ఇది తాగుబోతుల జాతీయ గీతం బ్రో' అంది కుక్క. ఖాళీ సీసాని దూరంగా విసిరేశాడు తెలుగు అబ్బాయి.

కర్నాటక బీజేపీలో టికెట్ల రగడ

మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ రాజీనామా

బెంగళూరు: కర్నాటక బీజేపీలో అసంతృప్తి భగ్గుమంటోంది. అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచేందుకు టికెట్ దక్కని నేతలు అసంతృప్తి బావుటా ఎగురవేస్తున్నారు. తనకు టికెట్ ఇవ్వనందుకు నిరసనగా బీజేపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాడి బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. బీఎస్ యడియూరప్పకు విధేయుడుగా పేరున్న సవాడికి లింగాయత్ సామాజిక వర్గంలో గట్టి పట్టు ఉంది. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి మహేశ్ కుంటహల్లి చేతిలో ఓడియారు. 2019లో పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరి, యడియూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన 17 మంది ఎమ్మెల్యేలలో కుంటహల్లి ఉన్నారు. తాజాగా సవాడీని పక్కనపెట్టి సిట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్ కుంటహల్లికే చోటు దక్కడంతో సవాడే రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ షెట్టార్ సైతం తనకు టికెట్ ఇవ్వకపోవడంపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిష్ఠానానికి మరోసారి తన అభ్యర్థిత్వంపై విన్నవించుకునేందుకు ఆయన దిల్లీ వెళ్లారు. అంతకు ముందు, మరో సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప సైతం తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని, రిటైర్ అవుతున్నానని ప్రకటించారు. కర్నాటక ఎన్నికల్లో పోటీచేసే 189 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ ప్రకటించింది. అనేకమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ దక్కకపోగా, కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన నేతలకు టికెట్లు రావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. తమ నేతకు టికెట్ నిరాకరించడంపై అనేక చోట్ల కార్యకర్తలు నిరసనలకు దిగుతున్నారు.

52 మంది సిట్టింగ్‌లకు టికెట్ గల్లంతు బీజేపీ తొలి జాబితా విడుదల

కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 189 మంది అభ్యర్థులతో తొలి విడత జాబితాను బీజేపీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో 52 మంది కొత్తవారికి చోటు కల్పించింది. చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు జీబితాలో చోటు దక్కలేదు. రెండో జాబితా కూడా త్వరలోనే వస్తుందని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్, జేడీఎస్ దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా...బీజేపీ మాత్రం అభ్యర్థుల ఎంపికలో మల్లగుల్లాలు పడుతోంది. సీఎం బొమ్మై తన సిట్టింగ్ స్థానం షిగ్గాన్ నుంచే మరోసారి బరిలోకి దిగుతున్నారు. మాజీ సీఎం యడియూరప్ప తనయుడు విజయేంద్ర షికారిపుర నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి యడియూరప్ప ఏడుసార్లు విజయం సాధించారు. మంత్రి బి.శ్రీరాములు బళ్లారి రూరల్ నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సీటీ రవి చిక్‌మంగళూరు నుంచి పోటీ చేయనున్నారు. కీలక నియోజకవర్గాలైన పద్మనాభనగర్, కనకపుర స్థానాల్లో ఆర్.అశోక్ బరిలోకి దిగనున్నారు. ఈ స్థానాల్లో ఆయనకు ప్రత్యర్థిగా కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పోటీ చేయనున్నారు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పోటీగా వరుణ నియోజకవర్గం నుంచి సీనియర్ నేత సోమన్న నిలవనున్నారు. చామరాజనగర్ నుంచి కూడా సోమన్న బరిలో నిలిచారు.

ఈసారి కొత్తవారికి టికెట్లు: సీటీ రవి

కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ తొలి జాబితా విడదల కావడం, ఆ పార్టీ నేతలు పెద్దసంఖ్యలో అసంతృప్తి వ్యక్తంచేయడంపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి స్పందించారు. ప్రయోగాలు చేసేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ఆసక్తి చూపిస్తుందన్నారు. బుధవారం జరిగిన ఓ సమావేశంలో సీటీ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, మిగిలిన పార్టీలతో పోల్చితే విభిన్నంగా ఆలోచిస్తోందన్నారు. అందుకే ఈ సారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు కొత్తవారికి అవకాశం కల్పించిందన్నారు. ఏప్రిల్ 20న మరో జాబితా విడుదల చేస్తుందని, ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన బీజేపీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని రవి అన్నారు.

ఆ కొంగను అతనికే అప్పగించండి: వరుణ్ గాంధీ

లక్నో: ఓ కొంగను కాపాడి, దాదాపు సంవత్సరంపాటు దానిని అల్లారుముద్దుగా పెంచుకున్న మహమ్మద్ ఆరిఫ్ అనే వ్యక్తికి బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ మద్దతుగా నిలిచారు. ఈ కొంగను కాన్పూరు జంతు ప్రదర్శనశాలలో పెట్టడంతో, దానిని తిరిగి ఆరిఫ్‌కు ఇచ్చేయాలని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

అటవీ శాఖాధికారులు ఈ కొంగను ఆరిఫ్ వద్ద నుంచి తీసుకుని, కాన్పూరు జంతు ప్రదర్శనశాలలో పెట్టారు. ఇది అంతరించిపోయే జాతి అని, సహజమైన వాతావరణంలో జీవించేందుకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. అయితే దీనిని జంతు ప్రదర్శనశాలలో పెట్టిన తర్వాత ఆహారం సక్రమంగా తినడం లేదని వార్తలు వచ్చాయి. ఆరిఫ్ ఆ కొంగను చూడటం కోసం ఆ జంతు ప్రదర్శనశాలకు వెళ్లినపుడు ఆ కొంగ చాలా ఆనందంతో ఎగురుతూ, ఎన్‌క్లోజర్ నుంచి బయటకు రావడం కోసం విశ్వ ప్రయత్నాలు చేసింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియోను వరుణ్ గాంధీ ట్విట్టర్‌లో షేర్ చేశారు. 'వారి ప్రేమ స్వచ్ఛమైనది. ఈ అందమైన పక్షి స్వేచ్ఛగా ఎగరడం కోసం ఉంది కానీ, బోనులో జీవించడానికి కాదు. దానికి తన ఆకాశాన్ని, స్వేచ్ఛను, స్నేహితుడిని తిరిగి ఇచ్చేయండి' అని తెలిపారు. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా ఆరిఫ్‌ను కలిశారు. బీజేపీ ప్రభుత్వం ఇతరులను ఏడిపించి సంతోషిస్తున్నట్లు ఉందని ఆరోపించారు. వారికి ప్రేమ వాతావరణం ఇష్టపడదన్నారు. మనుషుల మధ్య ప్రేమను అయినా, మనిషి, పక్షి మధ్య ప్రేమను అయినా వారు ఇష్టపడరన్నారు. ఇతరులను ఏడిపించి సంతోషించాలనుకునేవారికి ఎన్నటికీ సంతోషం దక్కదన్నారు. ఇదిలావుండగా, ఈ కొంగను ఆరిఫ్ ఎంతో ఆత్మీయంగా పెంచి, పోషించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరిఫ్ మోటారు బైక్‌పై వెళున్నపుడు కూడా ఈ కొంగను తీసుకొని వేళ్లేవాడని, అనేక మంది ఆ సన్నివేశాలను వీడియోలు తీశారని చెప్పారు.

నిప్పులపై నడిచిన బీజేపీ నేత పాత్రా

భువనేశ్వర్: బీజేపీ నేత సంబిత్ పాత్రా ఒడిశాలోని పూరి జిల్లాలో జరిగిన జాతరలో భాగంగా పది మీటర్ల వరకు ఏర్పాటు చేసిన అగ్నిగుండంపై నడిచారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ట్విటర్ వేదికగా పంచుకున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. 'పూరీ జిల్లాలోని రెబాటి రామన్ గ్రామంలో జరిగిన ఝాము జాతరలో పాల్గొన్నాను. నిప్పులపై నడిచి అమ్మవారిని పూజించాను. ప్రజలు సుఖసంతోషాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించాను. అగ్నిగుండంపై నడిచి అమ్మవారి దీవెనలు పొందడం వల్ల పుణ్యం పొందాను' అని ఆయన ట్వీట్ చేశారు. ఝాము జాతరలో కోరికలు నెరవేరాలని అమ్మవారు దులన్‌ను ప్రసన్నం చేసుకోవడానికి భక్తులు నిప్పుల మీద నడవడం ఇక్కడి సంప్రదాయం. ఒడిశాకు చెందిన సంబిత్ పాత్రా 2010లో బీజేపీతో తన రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పాత్రా చురుకుగా పాల్గొనడంతో పార్టీ ఆయనను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించింది.

సోయిలేకుండా పని చేయొద్దు

యోగి సర్కారుకు సుప్రీం చీవాట్లు

న్యూదిల్లీ: రెవెన్యూ బకాయిలు అంశంలో సమాజ్‌వాదీ పార్టీ నేతపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) ప్రయోగించడంపై సుప్రీంకోర్టు ఆక్షేపణ తెలిపింది. సోయి లేకుండా చేసిన పనిగా ఉత్తరప్రదేశ్ సర్కార్‌పై అక్షింతలు వేసింది. అధికార పరిధిపై సరైన కసరత్తు చేయలేదని పేర్కొంటూ బుధవారం కేసును కొట్టివేసింది. పిటిషనర్‌కు స్వేచ్ఛ ప్రసాదిస్తూ వెంటనే అతన్ని విడిచిపెట్టాలని ఆదేశించింది. మొరాదాబాద్‌లో ఒక ఆస్తికి సంబంధించిన రెవెన్యూ బకాయిలపై వివాదం నెలకొనడంపై సమాజ్‌వాదీ పార్టీ నేత యూసుఫ్ మాలిక్‌పై గత ఏడాది ఏప్రిల్‌లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎన్ఎస్ఏ ప్రయోగించింది. ఈ కేసు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎస్.కె.కౌల్, ఎ.అమానుల్లా సారథ్యంలోని ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. యూసుఫ్ మాలిక్‌పై ఎన్ఎస్ఏ కేసు ప్రయోగించడంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది ఎన్ఎస్ఏకి సంబంధించిన కేసా? అని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. 'అధికార పరిధి గురించి సరిగా అవగాహన లేకుండా, బుర్ర ఉపయోగించకుండా పెట్టిన కేసు. ఎన్ఎస్ఏ కింద ఈ కేసు ప్రొసీడింగ్స్‌ను మేము కొట్టివేస్తున్నాం. పిటిషనర్‌కు తక్షణం విముక్తి కల్గించాలని ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం తీర్పుచెప్పింది.

గెహ్లాత్ నా స్నేహితుడు

- ఆయన పార్టీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నా... పాల్గొంటున్నాడు
- వందేభారత్ రైలు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

జైపూర్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్‌ను స్నేహితుడిగా ప్రస్తావించారు. తన కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సంక్షోభాలు కొనసాగుతున్నప్పటికీ రాష్ట్ర మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైనందుకు ఆయనను ప్రశంసించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు జెండా ఊపి ప్రారంభించిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. తన ప్రసంగం చివరలో, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ముందుకు వచ్చిన డిమాండ్లతో పాటు కాంగ్రెస్‌లో కొనసాగుతున్న రాజకీయ గొడవలను ప్రధాని మోదీ ఎత్తి చూపారు. రైల్వే మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్ ఇద్దరూ రాజస్థాన్‌కు చెందిన వారని ప్రధాని ప్రస్తావిస్తూ, 'మీ రెండు చేతుల్లో లడ్డూలు ఉన్నాయని నేను గెహ్లాత్ జీ చెప్పాలనుకుంటున్నాను. రైల్వే మంత్రి రాజస్థాన్‌కు చెందినవాడు. రైల్వే బోర్డు చైర్మన్ కూడా రాజస్థాన్‌కు చెందిన వారే' అని తెలిపారు. 'స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే చేయాల్సిన పని ఇప్పటి వరకు జరగలేదు. కానీ నా మీద నీకు అంత నమ్మకం ఉన్నందున ఆ పనిని ఈరోజు నా ముందు ఉంచావు. ఇదే నీ నమ్మకం... నీ నమ్మకమే బలం. నా స్నేహానికి సంబంధించి... స్నేహంపై మీకున్న నమ్మకానికి నేను మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ప్రధాని మోదీ తెలిపారు. 'గెహ్లాత్ జీ ఈ రోజుల్లో అనేక రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్నందున నేను ఆయనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అయినప్పటికీ, అతను అభివృద్ధి పనుల కోసం సమయాన్ని వెచ్చించి రైల్వే కార్యక్రమంలో పాల్గొన్నాడు. నేను ఆయనకు స్వాగతం పలుకుతున్నాను' అని ప్రధాని మోదీ అన్నారు. జైపూర్ జంక్షన్ రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రాజస్థాన్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎంవీయే కలిసి పనిచేయాలి: పవార్

ముంబై: తమ మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాగానీ మహావికాస్ అఘాడీ (ఎంవీయే) కలిసి పనిచేయాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ నొక్కిచెప్పారు. ఎంవీయేలో ఎన్సీపీ, శివసేన (యూబీటీ), కాంగ్రెస్ పార్టీలు కలిసివున్న విషయం విదితమే. ఈ పార్టీల మధ్య అభిప్రాయ బేధాలు ఉండొచ్చుగానీ ప్రస్తుత పరిస్థితుల్లో కలిసి పనిచేయడమే సబబుగా ఉంటుందని పవార్ అభిప్రాయపడ్డారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో మంగళవారం జరిగిన భేటీలో మిత్రపక్షాల ఐక్యతపై ప్రధానంగా చర్చించినట్లు చెప్పారు. తమ మధ్య ఐక్యత కోసం కొన్ని కార్యక్రమాలకూ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అదానీ గ్రూపుపై ఉన్న ఆరోపణల మీద సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ అంశమై సుప్రీంకోర్టు ప్యానల్ జరిపిన దర్యాప్తునకు ఎన్సీపీ అధినేత అనుకూలంగా స్పందించిన క్రమంలో తాజా భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. అదానీ గ్రూపుపై జేపీసీ విచారణ కోసం కాంగ్రెస్, శివసేన (యూబీటీ) డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. జేపీసీ విచారణ కోసం బీజేపీ వ్యతిరేక పార్టీలు చేస్తున్న డిమాండ్‌కు ఎన్సీపీ సానుకూలంగా లేకపోయిగానీ విపక్ష ఐక్యతకు కట్టుబడి ఉన్నట్లు పవార్ తెలిపారు. జేపీసీ ఏర్పాటు అయినాగానీ లోక్‌సభ, రాజ్యసభలో బీజేపీకి ఉన్న సంఖ్యాబలం వల్ల కనీసం 14-15 మంది సభ్యులు అధికారపక్షం వారే ఉంటారని, విపక్షాల నుంచి ఐదారుగురు మాత్రమే ఉంటారని, తద్వార ప్యానల్‌కు బీజేపీనే నేతృత్వం వహిస్తుందని, నియంత్రణ 'బీజేపీ' ప్యానల్ వద్ద ఉంటుందని, నివేదిక ప్రభావితమవుతుందని ఆయనన్నారు. జేపీసీకి బదులు సుప్రీంకోర్టు నియమిత ప్యానల్ విచారణ జరిపించడం సబబుగా ఉంటుందని పవార్ సూచించారు.

సమావేశం సానుకూలం: సంజయ్ రౌత్

ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ మధ్య సమావేశం సానుకూలంగా జరిగిందని, మహారాష్ట్రతో పాటు దేశంలో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలపై ఇద్దరు చర్చించారని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తెలిపారు. ఠాక్రే అపాయింట్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కోరినట్లు చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతినిధిగా ఆయన ఠాక్రేను కలవనున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష ఐక్యతే ప్రధాన అజెండా అని అన్నారు. బాబ్రీ మసీదును కూల్చినప్పుడు అక్కడ ఒక్క శివసేన కార్యకర్త కూడా లేనట్లు బీజేపీ మంత్రి చంద్రకాంత్ పాటిల్ చేసిన వ్యాఖ్యలనుద్దేశించి బాలాఠాక్రేను అవమానించిన వారికి రాష్ట్ర కేబినెట్‌లో స్థానం ఉండరాదన్న తమ డిమాండ్‌కు శివసేన (యూబీటీ) కట్టుబడి ఉన్నదని రౌత్ అన్నారు.

రాజస్థాన్ కాంగ్రెస్‌లో సంక్షోభం

- గెహ్లాత్, పైలెట్ మధ్య ముదిరిన వివాదం
- జోక్యానికి అధిష్ఠానం నిర్ణయం
- త్వరలో 'మేజర్ సర్జరీ' సన్నాహాలు



న్యూదిల్లీ: రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ సంక్షోభంలో పడింది. ప్రస్తుత ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్‌కు, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలెట్ మధ్య వివాదం మరింత ముదురుతుండటం పార్టీని కలవరపాటుకు గురిచేస్తోంది. త్వరలోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికులు జరగనున్న నేపథ్యంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. పంజాబ్ తరహా పరిస్థితి రాజస్థాన్‌లో ఉత్పన్నం కాకుండా ముందుగానే సమస్యను పరిష్కరించే కసరత్తులో అధిష్ఠానం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజస్థాన్ ఇంచార్జి సుఖ్విందర్ రంధావా రాష్ట్ర పరిస్థితిని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరించారు. రాష్ట్ర పరిస్థితిని సమీక్షించిన ఖర్గే సాధ్యమైనంత త్వరగా ఈ వివాదం సద్దుమణిగిపోయేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. పైలెట్, గెహ్లాత్ మధ్య సమస్య చిలికిచిలికి గాలివానగా మారకముందే జోక్యం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం రాజస్థాన్‌లో 'మేజర్ సర్జరీ'కి కాంగ్రెస్ అధిష్ఠానం నడుంబిగించనట్లు పార్టీ అంతర్గత వర్గాల సమాచారం. అంతర్గత విభేదాలను పరిష్కరించి, ఐక్యతను పునరుద్ధరించే చర్యలను ఇతర సీనియర్ల అభిప్రాయాలు, రాజస్థాన్‌లో రాజకీయ పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే చేపట్టేందుకు వీలు ఉంటుందని పార్టీ వర్గాల పేర్కొన్నాయి. పంజాబ్‌లో మాజీ సీఎం అమరీందర్ సింగ్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ మధ్య వివాదం రాజస్థాన్‌లో పునరావృతం కాకుండా అధిష్ఠానం జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. కెప్టెన్ పార్టీ నుంచి నిష్క్రమించడం, గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు సొంత పార్టీ పెట్టడం విదితమే. మరోవైపు రాజస్థాన్‌లో గతంలో వసుంధర రాజే నేతృత్వ బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో గెహ్లాత్ ప్రభుత్వం విఫలమైందని పైలెట్ ఘాటు విమర్శలు చేశారు. తన డిమాండ్ పరిష్కారం కోసం ఒకరోజు దీక్ష చేపట్టడం విదితమే. కాగా గెహ్లాత్‌కే అధిష్ఠానం మద్దతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

8 వేలకు చేరువలో కరోనా కేసులు

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా మరోసారి విజృంభిస్తోంది. గడచిన 24 గంటల్లో 7,830 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. 223 రోజుల గరిష్టానికి తాజా కరోనా కేసుల సంఖ్య చేరిందని ఆరోగ్యశాఖ తెలిపింది. ఇక దేశవ్యాప్తంగా ప్రస్తుతం 40,215 యాక్టివ్ కేసులున్నాయి. కరోనాతో మంగళవారం ఒక్కరోజే 16మంది మృతి చెందారు. దిల్లీ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఇద్దరు చొప్పున, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కరుచొప్పున మృతి చెందారు. అత్యధికంగా కేరళలోనే ఐదుగురు కరోనాకు బలయ్యారు. తాజా మరణాలతో కలిసి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మృతి చెందిన వారి సంఖ్య 5,31,016కి చేరింది. క్రితంరోజు 5,676 కరోనా ఇన్ఫెక్షన్ కేసులు నమోదవ్వగా... ఒక్కరోజులోనే రెండువేలకు పెరిగి ప్రస్తుతం 7 వేలకు పైగా కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4,47,76,002 కేసులు నమోదయ్యాయి. తాజా కేసుల్లో 1,774 కేసులు ఎక్స్‌బిబి1.16 వేరియంట్‌కు సంబంధించినవని, వీటిని 22 రాష్ట్రాల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ కనుగొన్నట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం (ఐఎన్ఎస్ఏసీఓజీ) తెలిపింది. 230 మంది ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ఎక్స్‌బిబి 1.16.1 బారినపడినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా కరోనా రికవరీ రేటు 98.72 శాతంగా ఉంది. మరణాల రేటు 1.19 శాతంగా ఉంది.

ఎల్‌నినో ఉన్నా మంచి వానలే

భారత వాతావరణ శాఖ అంచనా

న్యూదిల్లీ: భారత్‌లో వర్షాభావ పరిస్థితులకు కారణమయ్యే 'ఎల్‌నినో' దాపురించే అవకాశాలు ఉన్నప్పటికీ ఈ ఏడాది దేశంలో నైరుతి రుతుపవనాల వల్ల సంభవించే వర్షపాతం సాధారణస్థాయిలో ఉంటుందని, వ్యవసాయ రంగానికి మేలుచేకూర్చనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమేట్ ప్రకటించిన మరుసటి రోజే వాతావరణ శాఖ మరోలా అంచనాలు వెల్లడించింది. భారత్‌లో వ్యవసాయం ప్రధానంగా వర్షాలపై ఆధారపడింది. మొత్తం పంట విస్తీర్ణంలో దాదాపు 52 శాతం భూభాగం వర్షాధారం. దేశ మొత్తం ఆహార ఉత్పత్తిలో 40 శాతం ఈ భూభాగంలో పండించే పంట నుంచే వస్తోంది. ఇది దేశ ఆహారభద్రతకు, ఆర్థిక సుస్థిరతకు కీలక భూమికగా మారింది. ఈ పరిస్థితుల్లో దేశంలో వర్షపాతం సాధారణంగా ఉంటుందని అంచనావేసి వ్యవసాయరంగానికి ఐఎండీ తీపికబురు మోసుకొచ్చింది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడెక్కితే ఎల్‌నినో అంటారు. దీనివల్ల భారత్‌లో రుతుపవన గాలులు బలహీనమై పొడిబారి వర్షాభావం తలెత్తుతుంది. జూన్ నుంచి సెప్టెంబర్ దాకా నైరుతి సీజన్‌లో దాదాపుగా సుదీర్ఘకాల సగటు అయిన 87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని కేంద్ర భూ శాస్త్రశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు. సాధారణం, అంతకు ఎక్కువ వానలు పడేందుకు 67 శాతం ఆస్కారముందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర అంచనా వేశారు. రెండో అర్ధభాగంపై ఏర్పడే ఎల్‌నినో ప్రభావం చూపొచ్చు. అంతమాత్రాన వర్షాభావం ఉంటుందని చెప్పలేం. ఎన్నోసార్లు ఎల్‌నినో వచ్చినా సాధారణ వర్షపాతం నమోదైందని ఆయన వివరించారు.

దిల్లీ స్కూల్, పాట్నా విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

న్యూదిల్లీ: ఈ మధ్యకాలంలో అనేక రంగాలకు చెందిన ప్రముఖులకు బెదిరింపు ఫోన్ల ఘటనలు ఎక్కువయ్యాయి. మొన్నటికి మొన్న సల్మాన్ ఖాన్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, శివసేన నేత సంజయ్ రౌత్‌ను చంపేస్తామని బెదిరింపులు వచ్చాయి. దీంతోపాటు వివిధ చోట్ల బాంబు పెట్టి పేల్చేస్తామంటూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. తాజాగా ఓ పాఠశాలతోపాటు విమానాశ్రయానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దిల్లీలోని ఓ పాఠశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. సాదిక్ నగర్‌లోని ది ఇండియన్ స్కూల్ ఆవరణలో బాంబు పెట్టినట్లు ఉదయం 10:49 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ మెయిల్ పంపారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం... ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించారు. తరువాత బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ స్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. పాఠశాల లోపల, పరిసర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. అక్కడ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు బీహార్‌లోని పాట్నా విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని వ్యక్తి నుంచి జయప్రకాశ్ నారాయణ్ విమానాశ్రయానికి బెదిరింపు కాల్ వచ్చింది. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారులు, పోలీసులు బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. ఎయిర్‌పోర్టు లోపల, బయట సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. బుధవారం ఉదయం 1.47 గంటలకు ఈ బెదిరింపు అధికారులకు అందింది. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సోదాలు నిర్వహించింది. విమానాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మద్యం కుంభకోణం...

ఈడీకి దిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూదిల్లీ: దిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కమ్యూనికేషన్ ఇన్‌చార్జి విజయ్ నాయర్ దాఖలు చేసుకున్న బెయిల్ అభ్యర్థనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు దిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు పంపింది. తదుపరి విచారణ తేదీని మే 19వ తేదీకి వాయిదా వేసింది. ఆప్‌తో ఉన్న రాజకీయ అనుబంధం కారణంగానే తనను బలిపశువును చేశారని బెయిలు పిటిషన్‌లో నాయర్ కోర్టుకు విన్నవించారు. గత ఫిబ్రవరిలో నాయర్, మరికొందరి బెయిల్ అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. మనీ లాండరింగ్‌లోని సెక్షన్ 3 కింద నిందితులపై చేసిన అభియోగాలు చాలా తీవ్రమైనవని, కేసు విచారణ దశలో ఉన్నందున ఈ సమయంలో బెయిలుపై విడుదల చేయలేమని విచారణ కోర్టు స్పష్టం చేసింది. సెషన్స్ కోర్టు తీర్పుపై హైకోర్టును నాయర్ ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ దినేష్ కుమార్ శర్మతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. దీనిపై ఈడీ వివరణ కోరుతూ నోటీసులు పంపింది. కాగా, ఇదే కేసులో దక్షిణాది వ్యాపారులు బినయ్ బాబు, అభిషేక్ బోయిన్‌పల్లి ఇప్పటికే దిల్లీ హైకోర్టులో బెయిల్ పిటిషన్లు వేశారు. లిక్కర్ ఎక్సైజ్ పాలసీ కేసులో ఈడీ నమోదు చేసిన రెండవ చార్జిషీటులో విజయ్ నాయర్, శరత్ రెడ్డి, బినయ్ బాబు, అభిషేక్ బోయినపల్లి, అమిత్ ఆరోరా, మరో 7 కంపెనీల పేర్లున్నాయి. ఎక్సైజ్ కేసుకు సంబంధించిన సీబీఐ కేసులో విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లికి కోర్టు ఇంతకముందు బెయిల్ ఇచ్చింది. అయితే విచారణ కోర్టు తీర్పును దిల్లీ హైకోర్టులో సీబీఐ సవాలు చేసింది. ప్రస్తుతం ఇది కోర్టు విచారణలో ఉంది.

మోదీ పాలనకు చరమగీతం

- రేపటి నుంచి సీపీఐ, సీపీఎం ప్రచారభేరి
- విజయవాడలో ప్రారంభ సభ
- ప్రచార జాతా పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ: మోదీ ప్రజా, కార్మిక వ్యతిరేక నిరంకుశ పాలనను అంతమొందించేందుకు ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సీపీఐ, సీపీఎం సంయుక్తంగా ప్రచార భేరి పేరుతో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి , సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విశాఖలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గు నాయుడులతో కలిసి ప్రచార జాతా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రచార భేరి ప్రారంభిస్తున్నామని తెలిపారు. విజయవాడలో జరిగే ప్రారంభ సభకు సీపీఎం సీనియర్ నాయకులు ప్రకాష్ కారత్, సీపీఐ పార్లమెంటరీ నేత వినయ్ విశ్వం తో పాటు ఉభయ పార్టీలకు చెందిన అనేకమంది సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రచార భేరిలో రాష్ట్రంలోని అన్ని నగర, పట్టణ, గ్రామ ప్రాంతాలలో సభలు నిర్వహిస్తామని, ముఖ్య ప్రాంతాల్లో జరిగే సభలకు రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు హాజరవుతారని వెల్లడించారు. ఏప్రిల్ 26న విశాఖపట్నంలో నిర్వహించే సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు హాజరవుతారని తెలిపారు. అల్లూరి జిల్లా లో అరకు, పాడేరు, చింతపల్లి, ప్రాంతాలలో జరిగే సభలకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తామని చెప్పారు. ప్రస్తుత బీజేపీ పాలనలో ఎవరూ నోరెత్తి మాట్లాడలేని విధంగా ప్రజలను, అధికారులను, నాయకులను కట్టడి చేస్తున్నారని విమర్శించారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా నిరంకుశ పాలన చేస్తున్నారని అన్నారు. అదానీ బ్లాక్ మెయిల్ చేసి గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులను ఎలా స్వాధీనం చేసుకున్నాడో ప్రజలందరూ చూస్తూనే ఉన్నారన్నారు. అల్లూరి జిల్లాలో హైడ్రో పవర్ ప్లాంట్లు గిరిజనుల కనీసం హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. ఒక క్షణం కూడా మోదీకి ప్రధాని కుర్చీలో కూర్చుని అర్హత లేదని అన్నారు. జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... ఇప్పటి వరకు మోదీ ప్రభుత్వం దేశంలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదన్నారు. 2014లో ఇచ్చిన హామీలలో ఏదీ నెరవేర్చలేదని విమర్శించారు. సామాన్య ప్రజలపై విపరీతంగా ధరల భారాన్ని మోపారన్నారు. రూ. 400 ఉండే గ్యాస్ సిలిండర్ ధర మూడింతలు పెరిగిందని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం అనంతరం రష్యా నుంచి అతి తక్కువ ధరకు ముడి చమురు లభిస్తున్నా పెట్రోల్ ధరలు తగ్గించలేదని అన్నారు. రిలయన్స్ సంస్థ అతి తక్కువ ధరకు రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకొని అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నదని తెలిపారు. నరేంద్ర మోదీకి అదానీ, అంబానీలు తప్ప ఇతర ప్రజలు కనిపించడం లేదని విమర్శించారు. వారి లాభార్జన కోసమే నరేంద్ర మోదీ అహర్నిశలూ పనిచేస్తున్నారన్నారు. ఈ మధ్య కాలంలో అమెరికా పర్యటనకు వెళ్లిన నిర్మలా సీతారామన్ ఒక యూనివర్సిటీలో ప్రసంగిస్తూ... భారత్‌లో ముస్లిం ప్రజలకు భద్రత ఉందని చెబుతూనే హిందుత్వాన్ని ప్రోత్సహిస్తూ ప్రసంగించారని అన్నారు. అలాంటప్పుడు 2002 గుజరాత్ అల్లర్లపై బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ పై ఎందుకంత రభస చేశారో చెప్పాలని అన్నారు. దేశంలో మైనారిటీలకు భద్రత లేదని, మైనార్టీలపై దాడులు పెరిగాయని, దీనిపై లెక్కలు బయటకు తీయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులపై కూడా తీవ్రమైన దాడులు జరిగాయని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో శ్రమను నమ్ముకుని బతికే వారిపై ఆర్థిక భారాలు పెరిగాయని అన్నారు. తద్వారా అదానీ, అంబానీలు లాభపడుతున్నారని తెలిపారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం జగ్గు నాయుడు, ఎం పైడిరాజు మాట్లాడుతూ 14 ఉదయం 9 గంటలకు నగరంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి జరిపి, పాదయాత్ర ప్రారంభిస్తామని తెలిపారు. ఈ నెల 26న గాజువాకలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మోదీ... జగన్ విధ్వంసక చర్యలపై

కళాకారులు ప్రజలను చైతన్యవంతులను చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-తెనాలి: మోదీ, జగన్ విధ్వంసక చర్యలపై కళాకారులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం అధ్వర్యంలో తెనాలి పట్టణంలోని పట్టణ రంగస్థల కళాకారుల భవనంలో బుధవారం మూడవ రోజు శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య శిక్షణా శిబిరంలో పాల్గొన్న శిక్షకులకు భవిష్యత్తులో వారు నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో మోదీ, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేయాలని అన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లా డుతూ కళాకారులు తమ ప్రదర్శనలను ప్రజలకు అర్థమయ్యే శైలిలో మోదీ, జగన్ విధ్వంసక చర్యలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. టీవీ చానళ్లు, పత్రికల్లో వ్యతిరేకంగా వార్తలు వస్తే, ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. కళాకారులు ఈ మూడురోజుల శిక్షణా శిబిరంలో పొందిన శిక్షణతో గ్రామగ్రామాన ప్రదర్శనలిచ్చి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ నెల 14 నుంచి జరిగే సీపీఐ, సీపీఎం పాద యాత్రలో పాటల ద్వారా ప్రజలను చైతన్య పరచాలన్నారు. అరసం జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు శిక్షణా శిబిరం నిర్వహించడాన్ని అభినందించారు. ఈ సంద ర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి శిక్షణా శిబిరంలో పాల్గొన్న కళాకారులను రామకృష్ణ, ముప్పాళ్ల అభినందించారు.

అక్టోబర్ కల్లా వెలిగొండ పూర్తి

పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తా

మార్కాపురం సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-మార్కాపురం: పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్ష పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటి సొరంగాన్ని పూర్తి చేశామని, రెండో సొరంగం 1.8 కిలోమీటర్లు మాత్రమే మిగిలి ఉందన్నారు. రెండవ సొరంగం పనులు సెప్టంబర్‌లో పూర్తవుతాయన్నారు. అగ్రవర్ణ పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చేపట్టిన వైయస్ఆర్ ఈబీసీ నేస్తం రెండవ విడత ప్రారంభోత్సవంలో భాగంగా మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో సీఎం జగన్ మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టులో మిగిలిన పనులన్నీ ఐదు లేదా ఆరు నెలల్లో పూర్తవుతాయన్నారు. నాటి సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి రెండు సొరంగాలకు సంబంధించి 36 కిలోమీటర్ల దూరానికిగాను 20 కిలోమీటర్లు మేర పనులు పూర్తి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సొరంగ మార్గాన్ని పూర్తి చేయగలిగామన్నారు. ఈ ప్రాజెక్టును చంద్రబాబు పూర్తిగా వదిలేశారన్నారు. ఆయన సీఎంగా ఉన్న కాలంలో కేవలం ఐదు కిలోమీటర్ల దూరం మాత్రమే సొరంగ మార్గాలు తవ్వగలిగారన్నారు. తాము వెలిగొండను పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మాజీ సీఎం చంద్రబాబు ఫేక్ సెల్ఫీ చాలెంజ్ చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో పూర్తి చేయని టిడ్కో గృహాల వద్ద సెల్ఫీలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ప్రతి ఇంటికి చేసిన మేలును చూసి అక్కడ సెల్ఫీలు దిగాలని చంద్రబాబుకు సూచించారు. ప్రజలకు ఏ ప్రభుత్వం ఏమి చేసిందో సెల్ఫీలు దిగడానికి సిద్ధమా అని జగన్ సవాల్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయలేదని, ఆ మ్యానిఫెస్టో వెబ్‌సైట్‌లోనే లేదని విమర్శించారు. పొదుపు మహిళలకు రుణాలు మాఫీ అంటూ మోసం చేసింది చంద్రబాబు కాదా అని నిలదీశారు. తాము ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు పొదుపు రుణాల మాఫీ మూడు విడతలు జరిగిందన్నారు. నాలుగేళ్లలో మహిళలకు అందజేసిన సంక్షేమ పథకాలను జగన్ వివరించారు. ఈ నాలుగేళ్లలో 2.7 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. ఇక్కడ అమలువుతున్న పథకాలను పొరుగు రాష్ట్రాలు కాపీ కొట్టే పరిస్థితిలో ఉన్నాయన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అందుకే మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందేలా అవకాశాలు కల్పించామన్నారు. మహిళల పేరుతో 30 లక్షల ఇంటి స్థలాలు ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఈబీసీల్లో అగ్రవర్ణ పేదకుటుంబాలకు అండగా ఈ ప్రభుత్వం ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి ఉండగా దోచుకో.. పంచుకో.. తినుకో.. పద్ధతి అమలు జరిగిందన్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో అంబేద్కర్, బీసీ భవన్‌లను మంజూరు చేస్తున్నామని, కంభం బస్టాండ్‌లో షాదీఖానా నిర్మాణ పనులకు రెండు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గంలో జగన్ సహకారంతో 1100 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మెడికల్ కళాశాలను, పొదిలి పెద్ద చెరువు సమ్మర్ వాటర్ ట్యాంకర్‌కు నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేశ్, సీహెచ్ వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కరణం బలరామకృష్ణమూర్తి, బుర్రా మధుసూదన్ యాదవ్, సుధాకర్‌బాబు, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, మార్కాపురం మునిసిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం ఎంపీపీ పోరెడ్డి అరుణా చెందచిరెడ్డి, జడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, కదిరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో పాలకుల విఫలం

ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు

తిరుమలై రామన్ హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ విమర్శించారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుమలై మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశంలో 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అధికారికంగా 10 లక్షలే ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం చెబుతుందన్నారు. ముఖ్యంగా రైల్వేలో చాలా ఖాళీలు ఉన్నాయిని, రైల్వే రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయటం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లకు విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అడిగితే పకోడీ బండి పెట్టుకోమని సలహా ఇస్తున్నారని విమర్శించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అనేవి ప్రజల ప్రాథమిక హక్కులని చెప్పారు. యూపీఎస్సీ రెగ్యులర్ కాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి మోదీ ప్రభుత్వం పూనుకోకుంటే దేశవ్యాప్త ఆందోళనలకు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 2లక్షల 10వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రూపు-1, గ్రూపు-2, ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి బెవర శ్రీనివాసరావు, నాయకులు అలీ, లంకే సాయి, విజయ్ పాల్గొన్నారు.

జగన్ మీ బిడ్డ కాదు... కేన్సర్ గడ్డ: చంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ: జగన్ మీ బిడ్డ కాదు.. కేన్సర్ గడ్డ అని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఘాటుగా విమర్శించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యటనలో భాగంగా బుధవారం విజయవాడ తూర్పు, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల మీదుగా చంద్రబాబు రోడ్ షోలో పాల్గొన్నారు. కేన్సర్ గడ్డను తొలగించుకోకపోతే శరీరమంతా వ్యాపిస్తుందని, దాన్ని తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజయ వాడ రాణిగారితోటలో వైసీపీ శ్రేణులు తెలుగుదేశంలో చేరిన సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా ఇంటింటికీ స్టిక్కర్లు అతికించటం అనైతికం అన్నారు. పార్టీ అయినా, వ్యక్తి అయినా వేరే ఇంటిపై రాయలన్నా, పోస్టర్ లేదా స్టిక్కర్ వేయాలంటే ఇంటి యజమాని అనుమతి తీసుకోవాలని ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి శేషన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వలంటీర్లకు ఇస్తున్నది ప్రజా ధనమేనని, జగన్ తాత, ముత్తాత సొమ్ము కాదని, ఈ విషయాలను ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మంచి పనులు చేస్తే జనం ఓట్లు వేస్తారని, చెడ్డపనులు చేస్తే చిత్తు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. జగన్ ఐదేళ్లలో చేసిన మంచి పనులు ఏమీ లేవన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, కరెంటు చార్జీలు పెంచారన్నారు. బయటి రాష్ట్రాల వారు ఏపీ పరిస్థితిని చూసి జాలి పడుతున్నారని చెప్పారు. రాజకీయాలకే అర్హతలేని వ్యక్తులు ప్రజా స్వామ్యాన్ని, ప్రజాజీవితాన్ని తమాషా అనుకోవద్దన్నారు. బెదిరిస్తే తోకలు కట్ చేస్తానని హెచ్చరించారు. రౌడీయిజాన్ని తుంగలో తొక్కేస్తామన్నారు. రౌతు కొద్ది గుర్రంలా పోలీసుల వైఖరి ఉందన్నారు. ప్రశ్నిస్తే చాలు మహిళలపైనా దాడులు చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు.

ప్రభాస్ తదుపరి చిత్రం పౌరాణికం!

హైదరాబాద్: హీరో ప్రభాస్ తదుపరి సినిమా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రాబోతోందని అగ్ర నిర్మాత దిల్ రాజు వెల్లడించారు. అది కూడా పౌరాణికమని చెప్పి అందరికీ షాక్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్, ప్రభాస్ కాంబోలో 'సలార్' సినిమా భారీ ఎత్తున తెరకెక్కుతోంది. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ మూవీ రూపొందుతోంది. ఇది పూర్తి కాగానే.. వీరిద్దరి కాంబినేషన్ లోనే మరో సినిమా వస్తుందని దిల్ రాజ్ తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబోలోనే పౌరాణిక సినిమా రాబోతోంది. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా రెడీ చేశారు. సలార్ తర్వాత.. ఎన్టీఆర్‌తో ప్రశాంత్ నీల్ సినిమా చేస్తారు. ఆ తర్వాత ప్రభాస్ సినిమా మొదలవుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 28న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

సంజయ్‌దత్‌కు గాయాలు

బెంగళూరు: కన్నడ నటుడు ధ్రువ సర్జా నటిస్తున్న కేడీ... ది డెవిల్ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ గాయపడ్డాడు. బెంగళూరులో షూటింగ్ కొనసాగుతుండగా జరిగిన ప్రమాదంలో సంజయ్‌దత్‌కు గాయాలయ్యాయి. మాగడి రోడ్ ప్రాంతంలో స్టంట్ డైరెక్టర్ రవి వర్మ కంపోజిషన్‌లో కీలక ఫైట్ సన్నివేశాల చిత్రీకరణలో భాగంగా బాంబు పేలుడుకు సంబంధించిన సన్నివేశాలు షూట్ చేస్తుండగా..ఈ ఘటన జరిగినట్టు సమాచారం. ఈ ప్రమాద ఘటనతో ధ్రువ సర్జా టీం వెంటనే షూటింగ్ నిలిపేసింది. సంజయ్ దత్‌కు చికిత్సనందించగా ప్రస్తుతం గాయాల నుంచి కోలుకుంటున్నారని, త్వరలోనే షూట్‌ను మళ్లీ ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

ముంబై జట్టులో రాణిస్తున్న హైదరాబాదీ క్రికెటర్

ఢిల్లీ: ఐపీఎల్ 2023లో ముంబై ఇండియన్స్ వరుస పరాజయాలు ఎదుర్కొంటోంది. అయితే ఒక్క ఆటగాడు మాత్రం ముంబై తరపున నిలకడగా రాణిస్తున్నాడు. సూపర్ స్ట్రైక్ రేట్‌తో సునామీ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. అతనెవరో కాదు.. హైదరా బాదీ క్రికెటర్ తిలక్ వర్మ. మంగళవారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ దుమ్ము రేపాడు తిలక్. సూపర్ ఇన్నింగ్స్‌తో ఈ సీజన్‌లో ముంబైకు మొదటి విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 29 బంతులు ఎదుర్కొన్న ఈ యంగ్ బ్యాటర్ 41 పరుగులు చేశాడు. ఇందులో ఒక ఫోర్, 4 సిక్సులు ఉండడం గమనార్హం. ముఖ్యంగా ముఖేష్ కుమార్ వేసిన 16వ ఓవర్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు తిలక్. వరుసగా ఫోర్, రెండు సిక్స్‌లు బాది గెలుపును ముంబైకు మరింత చేరువ చేశాడు. అంతకు ముందు బెంగళూరుతో జరిగిన మొదటి మ్యాచ్‌లో తిలక్ ఆడిన ఇన్నింగ్స్‌ను అంత ఈజీగా మర్చిపోలేం. ఆ మ్యాచ్‌లో కేవలం 46 బంతులు ఎదుర్కొన్న వర్మ 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మొత్తానికి ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన ఈ హైదరాబాదీ క్రికెటర్...147 పరుగులు చేశాడు. టోర్నీలో ముంబై తరపున టాప్‌స్కోరర్‌గా వర్మనే కొనసాగుతున్నాడు. మొత్తానికి ఐపీఎల్‌లో దుమ్మురేపుతున్న తిలక్ వర్మపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. మాజీ క్రికెటర్లు తిలక్ బ్యాటింగ్‌కు ముగ్ధులవుతున్నారు. 'ఎలాంటి పిచ్‌పై నైనా చెలరేగే సత్తా తిలక్‌కు ఉంది. అతను ముంబైకి దొరికిన విలువైన ఆస్తి' అని ప్రముఖ కామెంటేటర్ హర్షా బోగ్లే తిలక్‌ను అభినందించారు. 'త్వరలోనే తిలక్‌ను భారత జట్టులో చూడాలనుకుంటున్నాం.. మిడిల్ ఆర్డర్‌లో రాణించే సత్తా వర్మకు ఉంది' అంటూ క్రికెట్ ఫ్యాన్స్ నెట్టింట పోస్టులు షేర్ చేస్తున్నారు.

600 ఫోర్లతో వార్నర్ రికార్డు

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఐపీఎల్‌లో కొత్త మైలురాయిని చేరుకున్నాడు. ఆ టోర్నీలో అత్యధిక ఫోర్లు కొట్టిన రెండవ ఆటగాడిగా నిలిచాడు. అలాగే ఐపీఎల్‌లో 600 ఫోర్లు కొట్టిన తొలి విదేశీ ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వార్నర్ 51 పరుగులు చేశాడు. దాంట్లో ఆరు బౌండరీలు ఉన్నాయి. అయితే ఐపీఎల్‌లో 600 ఫోర్ల మార్క్‌ను చేరుకున్నారు. మొదటి స్థానంలో శిఖర్ ధావన్ ఉన్నాడు. 209 మ్యాచ్‌లు ఆడిన ధావన్.. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు అత్యధికంగా 728 ఫోర్లు కొట్టాడు. ఇక మూడవ స్థానంలో ఉన్న కోహ్లీ ఖాతాలో 591 ఫోర్లు ఉన్నాయి. అయిదో స్థానంలో రోహిత్ శర్మ(528), ఆరో స్థానంలో సురేశ్ రైనా(506) ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.